ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కాకినాడ
జిల్లా వార్తలు
శనివారం 16 నవంబరు 2024 | 5













← అన్నవరంలో పంపానది వద్ద సత్యదేవుడు, అనంతలక్ష్మి స్వామి, అమ్మవార్లకు హారతి ఇస్తున్న అర్చక స్వాములు

కార్తీకపౌర్ణమి సందర్భంగా అన్నవరంలో గిరిప్రదక్షిణ వైభవంగా జరిగింది. ఉదయం స్వామి అమ్మవార్లకు పల్లకీ సేవ చేపట్టారు. మధ్యాహ్నం గిరిప్రదక్షిణ నిర్వహించగా భక్తులు భారీగా హాజరయ్యారు.

జ్వాలాతోరణం

సత్యరథం వెనుక గిరిప్రదక్షిణ చేస్తున్న భక్తులు

వేడుకగా సత్యదేవుడి గిరిప్రదక్షిణ

- సత్యదేవ నామస్మరణతో మార్మోగిన రత్న, సత్యగిరులు
- ఉదయం పల్లకీ సేవ
- మధ్యాహ్నం సత్యరథం వెంబడి గిరియాత్ర
- గిరిప్రదక్షిణలో పాల్గొన్న లక్షా50వేల మంది భక్తులు
- సాయంత్రం ఘనంగా పంపా హారతులు
- వేడుకగా జ్వాలాతోరణం

7

పెద్ద.. ఘనులే!



జిల్లా గనులశాఖ డీడీ కార్యాలయంలో అవినీతి

- చక్రం తిప్పుతున్న ఉద్యోగులు
- అన్ని పనుల్లోను అడ్డంగా జోక్యం
- లీజుదారులకు అడ్డగోలు సహకారం
- టెంపరరీ పర్మిట్లతో గనులు దోపిడీ
- లక్షలకు లక్షలు మామూళ్ల దండుడు
- ఓ మహిళా ఉద్యోగిణి దందా

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

జిల్లా గనులశాఖ డీడీ కార్యాలయంలో పైరవీల రాజ్యం నడుస్తోంది.అధికారులను అడ్డం పెట్టుకుని కొందరు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు నచ్చినట్టల్లా ఆడుతున్నారు. మైనింగ్ వ్యాపారుల నుంచి లక్షలకు లక్షలు వసూళ్లు చేస్తూ కార్యాలయాన్ని తమ జేబులు నింపుకునేందుకు వాడుతున్నారు.ఏళ్ల తరబడి పాతుకుపోవడంతో లీజుదారులతో పరిచయాలను అనుకూలంగా మల్చుకుంటున్నారు.పోటీ వ్యాపారులపై తనిఖీలు, ఫైన్‌లు విధించి కొందరు వ్యాపారులు చెప్పినట్లల్లా ఆడుతుండడం,ఆమ్యామ్యాలు బాగా చదివించుకునే వ్యాపారులకు కావాల్సిన పనిని చిటికెలో చేసిపెట్టేయడం,వారి అక్రమాలకు గంతలు కట్టేస్తూ అడ్డగోలుగా వ్యవహరిస్తున్నారు.

అంతా అడ్డగోలే..

జిల్లాలో మైనింగ్ లీజులు, తాత్కాలిక పర్మిట్ల జారీ,లీజుల పొడిగింపునకు సంబంధించి అనుమతులు, గనుల్లో ఉల్లంఘనలపై తనిఖీలు, జరిమానాల విధింపు, ఆకస్మిక తనిఖీలతో లీజుదారుల ఆటకట్టించడం వంటి పనులన్నీ గనులశాఖ డీడీ కార్యాలయం పర్యవేక్షిస్తుంది. డీడీతోపాటు ఆర్‌ఐలు ఎప్పటికప్పుడు ఇవన్నీ పర్యవేక్షించి మైనింగ్ తవ్వకాల్లో పారదర్శకత ఉండేలా చూడాలి.కానీ గడచిన ఐదేళ్ల వైసీపీ పాలనలో పూర్తిగా భ్రష్టుపట్టిన డీడీ కార్యాలయం కూటమి ప్రభుత్వంలోను ఏమాత్రం మార్పు లేకుండా పైరవీలు, వసూళ్లకే పెద్దపీట వేస్తూ పనిచేస్తోంది. ప్రధానంగా వైసీపీ నుంచీ కొనసాగుతున్న కొందరు లీజుదారులకు ఈ కార్యాలయం అడ్డాగా ఉంది. వాస్తవానికి ఇక్కడ డీడీతోపాటు,ఆర్‌ఐ, మరో ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగులు ఉండగా, వీరికితోడు మరో ఇద్దరు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు పనిచేస్తున్నారు. కార్యాలయంలో మొత్తం ఆరుగురు వరకే ఉండగా, ఇక్కడ వ్యవహారాలన్నీ కేవలం ఆ ఇద్దరు అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల కనుసన్నలో మాత్రమే కొనసాగుతున్నాయి. వాస్తవానికి అమల్లోఉన్న క్వారీ, గ్రావెల్ పర్మిట్లకు సంబంధించి తవ్వకాల్లో ఉల్లంఘనలను అధికారులు తనిఖీ చేయాలి. కానీ ఇవేం లేకుండా సదరు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు నెలనెలా లీజుదారుల నుంచి మామూళ్లు వసూలు చేస్తూ అధికారులకు అందించడంలో కీలకపాత్ర పోషిస్తున్నారు.ప్రధానంగా 17ఏళ్ల నుంచి అవుట్‌సోర్సింగ్ ఉద్యోగిగా ఇక్కడ పాతుకుపోయిన ఓ మహిళా డేటా ఎంట్రీ ఆపరేటర్ కార్యాలయాన్ని గుప్పిటపెట్టుకుని నడిపిస్తున్నారు.తాము చెప్పినట్టల్లా ఆడే లీజుదారులను పక్కన కూర్చోబెట్టుకుని ఫైళ్లలో మార్పులు, చేర్పుల నుంచి లీజుల పొడిగింపు సిఫార్సులు, జరిమానాలు లేకుండా రాయ బేరాలు మొత్తం నడిపిస్తున్నారు. వారినుంచి లంచనుగా మామూళ్లు పిండేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. పెద్దాపురం రామేశంమెట్టలో గడచిన అయిదేళ్లలో వైసీపీ కాకినాడ కీలకనేత వందలకోట్లు అడ్డగోలు తవ్వకాలతో సంపాదించారు. తాత్కాలిక పర్మిట్ల పేరుతో మొత్తం మట్టి మింగేశారు. ఈ వ్యవహారం సదరు ఉద్యోగి చక్రం తిప్పి మామూళ్ల వసూళ్లలో కీలకంగా వ్యవహరించారు. ప్రస్తుతం హరిహర మెటల్ పేరుతో మూడు, కె.పుత్రయ్య పేరుతో ఒకటి, ఆర్‌పీఎస్ఎల్ పేరుతో మూడు తాత్కాలిక పర్మిట్ల పేరుతో తవ్వకాలకు సెప్టెంబరులో అనుమతి ఇవ్వగా, వీటి గడువు డిసెంబర్ 11తర్వాత ముగుస్తున్నాయి. టీపీల ముసుగులో బయట రియల్‌ఎస్టేట్ అవసరాలకు ఇక్కడి మట్టి వందల లారీల్లో తరలిపోతోంది. కానీ అధికారులు మాత్రం కనీసం తనిఖీలకు వెళ్లడం లేదు. ఇందుకు భారీగా సదరు ఉద్యోగి వ్యాపారుల నుంచి పిండేశారు. వీటి తాత్కాలిక పర్మిట్ కూడా త్వరలో ముగిసిపోతుండడంతో ప్రస్తుతం లీజుదారులు కార్యాలయంలోనే కూర్చుని పొడిగింపు కోసం రాయబేరాలు నడుపుతున్నారు.ఇందుకోసం ఆ ఉద్యోగి మళ్లీ చక్రంతిప్పుతున్నారు.కొందరు అక్రమ లీజుదారులపై ఈగ వాలకుండా డీడీకి ఫైళ్లు పంపే విషయంలో సహకరిస్తూ రెండు చేతులా సంపాదిస్తున్నారు. క్వారీలు, గ్రావెల్ లీజులు పొందిన వ్యాపారులకు సంబంధించి తవ్వ కాల్లో ఉల్లంఘనలు,రీసర్వేలు చేసి ఫైన్‌లు వసూ లు చేయాలి. కానీ ఇవేవీ ఉండకుండా కొం దరు లీజుదారులతో బేరాలు నెలవారీ వసూళ్లతో అధికారుల జేబులు నింపడంలోను ఆ ఉద్యోగి చక్రం తిప్పుతున్నారు.

ఆఫీసంతా ఆ వ్యాపారిదే..

టీపీల ముసుగులో రామేశంమెట్ట నుంచి వందల టిప్పర్ల గ్రావెల్‌ను కొన్నేళ్లుగా బయటకు అమ్మేస్తూ కోట్లు కూడబెట్టిన ఓ వ్యాపారి తనయుడు నిత్యం ఈ కార్యాలయంలోనే కూర్చుని సొంత కార్యాలయం తరహాలో సదరు ఉద్యోగితో కావాల్సిన పనులు చేయించుకుంటున్నారు. తనకు పోటీగా ఉన్న క్వారీలపై ఫిర్యాదు చేసి ఆమె ద్వారా జరిమానాలు వేయిస్తుండడం విశేషం. ఇటీవల రౌతులపూడిలో తమ పక్కనే ఉన్న ఓ క్వారీపై సదరు వ్యాపారి ఈమె ద్వారా భారీ ఫైన్ కూడా వేయించడం విశేషం. ఇందుకు భారీగానే సదరు ఉద్యోగి నొక్కేశారు. దాదాపు పదిహేడేళ్లుగా గనుల శాఖలో ఉండడంతో అన్ని విషయాల్లోను చక్రం తిప్పుతూ లీజుదారుల నుంచి భారీగా మెక్కేస్తున్నారు. ఈ కార్యాలయంలో ఎవరు డీడీని కలవాలన్నా ముందు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులనే ప్రసన్నం చేసుకోవాలి.దీంతో అధికారులు సైతం వీరు చెప్పినట్టే లీజుదారులను పిలిపించి ఉల్లంఘనలపై ఫైన్ లు వేయాల్సి వస్తుందంటూ హెచ్చరిస్తున్నారు. ఆవెంటనే సదరు ఉద్యోగి వ్యాపారులతో మాట్లాడి కథ నడిపిస్తున్నారు.వ్యాపారులు సైతం సదరు ఉద్యోగి మాట వినకపోతే ఫైన్‌లు భారీగా కట్టాల్సి వస్తుందనే భయంతో ఈమె చెప్పినట్టల్లా చేస్తున్నారు.

రహదారుల మరమ్మతులకు
పుష్కలంగా నిధులు

- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

పిఠాపురం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అధ్వానంగా ఉన్న ఆర్‌అండ్‌బీ రహదారుల మరమ్మతులు, బ్రిడ్జిల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. విపత్తుల నిర్వహణ, ఇతర పద్దుల కింద రాష్ట్ర రహదారులు, జిల్లా రోడ్లుపై ఉన్న గుంతలు పూడ్చడంతో పాటు జంగిల్ క్లియరెన్స్, పూర్తిగా దెబ్బతిన్న ప్రాంతాల్లో రహదారుల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తూ ప్రభుత్వం శుక్రవారం రాత్రి జీవోలు జారీ చేసింది. రాష్ట్ర రహదారుల శాశ్వత పునర్నిర్మాణం నిమిత్తం స్టేట్ డిజాస్టర్ మిటిగేషన్ ఫండ్ కింద జిల్లాలోని రెండు మైనర్ బ్రిడ్జిల నిర్మాణం సహా 8 పనులకు రూ.8.58కోట్లు కేటాయించారు. జంగిల్ క్లియరెన్స్‌తోపాటు జిల్లా రహదారుల మరమ్మతులకు సంబంధించి 23 పనులకుగాను రూ133.6లక్షలు విడుదల అయ్యాయి. రాష్ట్ర, జిల్లా రహదారులపై గుంతలు పూడ్చడంతో పాటు మరమ్మతులకు సంబంధించి 34 పనులకు రూ9.15కోట్లు కేటాయించారు. ఇప్పటికే పలు రహదారుల అభివృద్ధి, మరమ్మతులకు నిధులు విడుదల కాగా పనులు జరుగుతున్నాయి. జిల్లా అధికారుల నుంచి అందిన ప్రతిపాదనల మేరకు అదనపు నిధులు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీతో అన్ని ప్రాంతాల్లోనూ మరమ్మతుల పనులు జోరందుకోనున్నాయి.

ప్రజల సమస్యలు పరిష్కరించాలి

- ఎమ్మెల్యేలతో విందు సమావేశంలో ఇన్‌చార్జి మంత్రి నారాయణ



మంత్రి నారాయణను శాలువాతో సత్కరిస్తున్న ఎమ్మెల్యే కొండబాబు

కాకినాడ సిటీ, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్ల పాలనలో నియోజకవర్గాల్లో అనేక సమస్యలు పేరుకుపోయాయని, ఈ పరిస్థితుల్లో ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తూ అండగా నిలవాలని రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగూరి నారాయణ పేర్కొన్నారు. జిల్లా ఎమ్మెల్యేలతో శుక్రవారం రాత్రి అమరావతిలోని తన నివాసంలో మంత్రి నారాయణ విందు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లాలోని పలు అంశాలపై మంత్రి చర్చించారు. కూటమి ప్రభుత్వంపై ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారని, అందుకు అనుగుణంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్ సిక్స్ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. తూర్పు, పశ్చిమ ఉమ్మడి గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పట్టభద్రుల ఓటర్ల నమోదు లక్ష్యాలను చేరుకోవాలన్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా బాధ్యతలు చేపట్టాక తొలిసారిగా ఎమ్మెల్యేలతో మంత్రి నారాయణ భేటీ అయ్యారు. తొలుత మంత్రి నారాయణను శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. సమావేశంలో జిల్లా ఎమ్మెల్యేలు నిమ్మకాయల చినరాజప్ప, జ్యోతుల నెహ్రూ, వనమాడి కొండబాబు, పంతం నానాజీ, వరుపుల సత్యప్రభ, యనమల దివ్య, మాజీ ఎమ్మెల్యే ఎస్‌వీఎస్ఎన్ వర్మ, జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

రైతు కష్టం.. దళారుల పాలు

- చివరికి అన్నదాతకు కష్టాలే
- కొనుగోలు కేంద్రాలపై ప్రచారమేది
- నిల్వలు ఉంచలేక రైతుల అవస్థలు
- అయినకాడికి అమ్మకాలు
- ఇష్టానుసారం కొనుగోళ్లు



సామర్లకోట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గత నెల 27 నుంచి పంటకోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. రైతులు ధాన్యాన్ని ఇంటికి తీసుకువస్తున్నారు. ఆయా ప్రధాన రహదారుల వెంబడి, మైదాన ప్రాంతాలు, నూతన లేఅవుట్ ప్రాంతాల్లో ఆరబోస్తున్నారు. ధాన్యం కొనుగోలుపై అధికారులు, నాయకులు ప్రకటనలే తప్ప క్షేత్రస్థాయిలో రైతులను చైతన్యవంతం చేయలేకపోతున్నారు.ఈ నేపథ్యంలో రైతులు దళారులను ఆశ్రయిస్తున్నారు.వారు పచ్చి ధాన్యం, తరుగు పేరిట మద్దతు ధర తగ్గించి కొనుగోలు చేస్తున్నారు. దీంతో తమకు నష్టం తప్పడంలేదని రైతులు ఆవేదన చెందుతున్నారు.

జరగని ధాన్యం కొనుగోళ్లు

ఈ ఏడాది ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఖరీఫ్ సీజన్లో 5.54 లక్షల ఎకరాల్లో వరిసాగు చేపట్టగా సుమారు 14 లక్షల మెట్రిక్‌టన్నుల మేర ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయాధికారుల అంచనా. ప్రభుత్వ మద్దతు ధర ప్రకారం గ్రేడ్ ఏ రకానికి బస్తాకు రూ.1,740 చొప్పున చెల్లించాల్సి ఉంది.సాధారణ రకానికి బస్తాకు రూ.1,725 చెల్లించాల్సి ఉంది. ఈ ధరలపై అధికారులు రైతులను చైతన్యవంతం చేయకపోవడంతో రైతులు దళారీలను నమ్మి మోసపోతున్నారు.అధిక శాతం మిల్లర్లకు బ్యాంకుగ్యారెంటీలు రాకపోవడంతో ఆయా మిల్లులు రైతుల నుంచి ధాన్యాన్ని కొనుగోళ్లు చేయలేకపోతున్నాయి. ప్రస్తుత తరుణంలో బ్యాంకు గ్యారెంటీలు ఉన్న మిల్లులు మాత్రమే ధాన్యాన్ని రైతుల నుంచి కొనుగోళ్లు చేస్తున్నారు. మాసూళ్లకు తగిన రీతిలో ధాన్యం కొనుగోళ్లు జరగడం లేదన్న ఆరోపణలున్నాయి.

రైతుల్లో అయోమయం

అధిక శాతం మండలాల్లో పంట కోతలు, మాసూళ్లు, ధాన్యం ఆరబోతలతో రైతులు నిమగ్నమయ్యారు. ప్రస్తుత వాతావరణం మార్పుల కారణంగా రైతులు పచ్చిధాన్యాన్ని సైతం విక్రయించేందుకు సిద్ధమవుతున్నారు. క్షేత్రస్థాయిలో ధాన్యం మద్దతు ధర విషయంలో ఆయా శాఖల అధికారులు పర్యటనలు కానరాక రైతులు అయోమయ పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. చేతికందిన ధాన్యాన్ని భద్రపరుచుకునే అవకాశాలు సైతం ప్రభుత్వం కల్పించకపోవడంతో ప్రైవేట్ గోదాముల్లో ధాన్యాన్ని దాచుకునేందుకు అదనపు ఖర్చులు భరించాల్సివస్తుందని వాపోతున్నారు. మిల్లర్ల నుంచి కనీసం భరోసా లేకపోవడం, వ్యవసాయాధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించకపోవడం వంటి కారణాలతో మారుతున్న వాతావరణ పరిస్థితుల కారణంగా నిల్వ చేసుకునే అవకాశాలు లేక రైతులు దళారీలను ఆశ్రయించి అయినకాడికి అమ్ముకోవాల్సిన దుస్థితి నెలకొంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ప్రస్తుత ఖరీఫ్ వరిసాగుద్వారా సుమారు 14 లక్షల మెట్రిక్ టన్నుల మేర ధాన్యం ఉత్పత్తి కాగలదని అంచనాలు వేయగా వాటిలో సుమారు 5 లక్షల మెట్రిక్ టన్నుల మేర ధాన్యాన్ని రైతుల నుంచి ప్రభుత్వం సివిల్ సప్లయ్ ద్వారా కొనుగోలు చేయాల్సి ఉంది.

అర్జీల శాశ్వత పరిష్కారానికి కృషి చేయాలి: కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రతివారం నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమంలో నమోదైన అర్జీల శాశ్వత పరిష్కారానికి కృషి చేయాలని కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం అధికారులతో వివిధ శాఖలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు అర్జీలపై దృష్టిపెట్టి గడువులోపు పరిష్కరించాలన్నారు. జిల్లాలో రైల్వేఓవర్ బ్రిడ్జిల నిర్మాణాలకు అవసరమైన భూసేకరణ చేయాలన్నారు. ట్రైనీకలెక్టర్ భావన, ఆర్డీవోలు మల్లిబాబు, శ్రీరమణి పాల్గొన్నారు.

వసతిగృహం ఆధునికీకరణ చేయాలి

కాకినాడ నగరం బాలాజీచెరువు సెంటర్‌లో ఉన్న ఎస్సీ బాలుర వసతిగృహం ఆధునికీకరణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని దళిత సంఘాల నాయకులు కలెక్టర్‌ను శుక్రవారం కోరారు. నిధుల కొరతవల్ల డైనింగ్‌హాలు నిర్మాణ దశలో పనులు నిలిచిపోయిందని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనికి కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. దళితనాయకులు అయితాబత్తుల రామేశ్వరరావు, రామారావు పాల్గొన్నారు.

శివనామస్మరణతో మార్మోగిన శైవక్షేత్రాలు

- భక్తజనసంద్రమైన పాదగయ క్షేత్రం
- సామర్లకోట భీమేశ్వరాలయంలో విశేష పూజలు
- భక్తిశ్రద్ధలతో కార్తీకపౌర్ణమి పూజలు



పిఠాపురం పాదగయ పుష్కరిణిలో కార్తీక పౌర్ణమి స్నానాలు ఆచరిస్తున్న భక్తులు





సామర్లకోటలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు.. ఐపీఎస్ అధికారిణి వాణీమోహన్

పిఠాపురం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): పిఠాపురం శివనామస్మరణతో మార్మోగింది. పాదగయ క్షేత్రం భక్తజనసంద్రమైంది. పిఠాపురం పట్టణంలోని పాదగయ క్షేత్రం శుక్రవారం తెల్లవారుజాము నుంచి అర్ధరాత్రి వరకూ భక్తులతో కిటకిటలాడింది. పాదగయపుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయస్వామి, రాజరాజేశ్వరీదేవి, పురుహూతికా అమ్మవార్లను దర్శించుకుని పూజలు జరిపారు. రాజరాజేశ్వరీ సమేత ఉమాకుక్కుటేశ్వరస్వామికి శాంతికళ్యాణం నిర్వహించారు. సాయంత్రం వరకూ ఉపవాసం ఉన్న మహిళలు ఆలయంలో దీపాలు వెలిగించి కార్తీక నోము ఆచరించారు. పాదగయ పుష్కరిణిలో అరటిదొప్పలపై ఉంచిన దీపాలను వదిలారు. పౌర్ణమి సందర్భంగా పురుహూతికాఅమ్మవారికి చండీహోమం నిర్వహించారు. ఆలయంలో కార్యనిర్వహణాధికారి కాట్నం జగన్మోన శ్రీనివాస్, సూపరింటెండెంట్ వీరభద్రరావుల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. రాత్రి జ్వాలాతోరణం నిర్వహించారు.

సామర్లకోట భీమేశ్వరాలయంలో..

సామర్లకోట, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని సామర్లకోట భీమేశ్వరాలయంలో శుక్రవారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ అధికారుల ఆధ్వర్యంలో ఆలయ పండితులు సోమేశ్వరశర్మ, చెరుకూరి రాంబాబు, రాజశేఖర్‌శర్మ, అంజిబాబు, వెంకన్న వేదమంత్రోచ్చారణల మధ్య అభిషేకపూజలు నిర్వహించారు. అమ్మవారిని, స్వామివారిని దర్శించి ప్రసాదాలు స్వీకరించారు. శ్రీపాదరాజశేఖర ఘనాపాఠి నేతృత్వంలో మధ్యాహ్నం జరిగిన లక్షపత్రి పూజల్లో సామర్లకోట భీమేశ్వరా అన్నదాన ట్రస్ట్ ప్రతినిధి బిక్కిన పరమేశ్వర సాయిసత్యనారాయణ దంపతులు, బిక్కిన రాజశేఖర్ కుటుంబ సభ్యులు ఆశీనులయ్యారు. ఆకాశదీప పూజల్లోను ఆశీనులయ్యారు.కార్తీకదీపారాధన సంఘసభ్యులతో నిర్వహించిన జ్యోతిర్లింగార్చన పూజల్లోను అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. నూతన వధువులు కార్తీకమాసంలో కందపిలకలతో కూడినస్వయంపాకాలు స్వామికి దానం చేశారు.

చిన్నారులపై లైంగిక అకృత్యాల నివారణకు ఆరునెలలపాటు ప్రత్యేక క్యాంపైన్

- నేరాలకు పాల్పడిన వారిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు
- జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్(కాకినాడ), నవంబరు 15(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో చిన్నారులై లైంగిక అకృత్యాల నివారణకు ప్రజా చైతన్యాన్ని జాగృతం చేసేందుకు ప్రత్యేక క్యాంపైన్ నిర్వహిస్తున్నామని కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆదేశాల మేరకు ఆరునెలలపాటు జిల్లాలో ప్రత్యేక క్యాంపైన్ నిర్వహిస్తామన్నారు. గ్రామీణాభివృద్ధి, డ్వామా, డీఆర్‌డీఏ, ఐసీడీఎస్, జిల్లా పంచాయతీశాఖల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. చిన్నారులపై అకృత్యాల నివారణకు 1098, 7331126044 హెల్ప్‌లైన్ నెంబర్లు ఏర్పాటు చేశామన్నారు. చైల్డ్‌సేఫ్ కాకినాడ అనే అంశంతో ప్రత్యేక వీడియోను రూపొందించామన్నారు. ఈ వీడియోను అన్ని మాధ్యమాల్లో ప్రచారం చేయడంతోపాటు ప్రభుత్వపరంగా ఏ కార్యక్రమం జరిగినా రెండు నిమిషాలు వీడియోను ప్రదర్శిస్తామన్నారు. పోక్సో చట్టాన్ని జిల్లాలో సమర్థంగా అమలు చేస్తామన్నారు.

అపార్ 70శాతం పూర్తి

అపార్ నెంబరు నమోదు కార్యక్రమం జిల్లాలో ఇప్పటివరకు 70శాతం వరకు పూర్తి అయ్యిందని కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. విద్యాపరంగా ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలకు ఇది తప్పనిసరిగా ఉండాలన్నారు. ఒకటి నుంచి 12వ తరగతి వరకు ఉన్న విద్యార్థులు అందరూ అపార్ నమోదు కావాలన్నారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల విద్యార్థులకు ఇది వర్తిస్తుందన్నారు. బర్త్ సర్టిఫికెట్లు లేని వారికి వారం రోజుల్లో బర్త్ సర్టిఫికెట్లు జారీ చేయాలని తహసీల్దార్లకు ఆదేశాలు ఇచ్చామన్నారు. జనన ధృవీకరణ పత్రం, ఆధార్‌కార్డు, అపార్‌నెంబరు అంశాలు ఒకే విధంగా ఉండాలన్నారు. ఎక్కడా ఒక్క అక్షర దోషం లేకుండా నమోదు చేస్తారన్నారు. ఆధార్‌లో స్పేస్, ఫుల్‌స్టాప్‌లు పడితే వాటిని తొలగించి అపార్ నమోదు జరుగుతుందన్నారు.


గోదారంతా జనం: కిటకిటలాడిన రాజమహేంద్రవరం పుష్కరఘాట్


రాజమహేంద్రవరం గోదావరిలో దీపాలు వదులుతున్న మహిళ


పోటెత్తిన భక్తజనం: ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో భక్తుల క్యూ

నోము పండించవా స్వామి: కార్తీక నోములకు స్వయంపాక దానాలతో ఆలయాలకు చేరుకున్న నవ వధువులు


సామర్లకోట భీమేశ్వరాలయంలో..


ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో..


ఐ.పోలవరం వీరేశ్వరస్వామి ఆలయంలో..


పాదగయ క్షేత్రంలో పున్నమి కాంతులు


చూడు..స్వామి: ప్రత్యేక అలంకరణలో సామర్లకోట కుమారరామ భీమేశ్వరస్వామి

శివయ్యా.. చూడయ్యా

» కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆలయాలకు పోటెత్తిన భక్తులు

ఆరనీకుమా ఈ దీపం కార్తీక దీపం.. చేర నీ పాద దీపం కర్పూరదీపం..అంటూ భక్తులు దీపాలు వదిలారు.. నీ నోము నోచుకుంటున్నాం.. మమ్మల్ని చల్లంగ చూడు స్వామి అంటూ భక్తులు మొక్కు కున్నారు. కార్తీకపౌర్ణమి సందర్భంగా శైవక్షేత్రాలు.. గోదావరి రేవులు భక్తజనంతో కిటకిటలా డాయి.. శుక్రవారం తెల్లవారుజామున 3 గంటల నుంచే భక్తులు పుణ్యక్షేత్రాలు, నదీతీరాలకు చేరుకున్నారు.. ఆకాశంలో చుక్క కనుపడుతుం డగానే దీపాలు వదలాలని..తెల్లవారుజామునే ఆకాశానికి చూపిస్తూ కార్తీక దీపాలు విడిచిపెట్టారు.. శైవక్షేత్రాల్లో అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. ఉమ్మడి జిల్లాలోని రాజమహేంద్రవరం, కొవ్వూరు గోదావరి తీరంతోపాటు పిఠాపురంలోని కోనేరు, సామర్లకోట, ద్రాక్షారామల్లోని భీమేశ్వరాలయాలో మహిళలు కార్తీకదీపాలు వెలిగించారు. బ్రాహ్మణులకు దీపదానం చేశారు.. శక్తిమేరకు స్వయంపాకం ఇచ్చారు. కార్తీక నోము సందర్భంగా ఆయా ఆలయాల్లో నూతన వధువులు కందపిలకలు.. పసుపు మొక్కలతో కూడిన స్వయంపాక దానాలతో కనిపించారు.


వరరామచంద్రాపురం మండలం రేఖపల్లి శివాలయంలో దీపారాధన


సామర్లకోటలో ధ్వజస్తంభానికి మొక్కుతున్న భక్తజనం


భక్తజనంతో నిండిన కొవ్వూరు గోష్పాదక్షేత్రం


పిఠాపురం పాదగయలో శివుడికి అభిషేకం చేస్తున్న భక్తజనం



గొల్లప్రోలు మండలం దుర్గాడ శివాలయం ఆలయ శిఖరంపై దర్శనమిస్తున్న పౌర్ణమి చంద్రుడు..

(ఇన్‌సెట్‌లో) పిఠాపురం పాదగయ క్షేత్రంలో ఆలయ శిఖరంపై పౌర్ణమి చంద్రుడు

ఆలయ శిఖరాన పౌర్ణమి చంద్రుడు

గొల్లప్రోలు రూరల్/పిఠాపురం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆలయ శిఖరాలపై పౌర్ణమి చంద్రుడు దర్శనమిచ్చాడు. కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం దుర్గాడ శివాలయంలో రాజగోపురం, ఆలయ శిఖరంపై చంద్రుడు దర్శనంతో భక్తులు భక్తతన్మయత్వంతో తిలకించి పూజలు చేశారు. కార్తీకపౌర్ణమి రోజున చంద్రదర్శనం కావడంతో భక్తులు పులకించారు. ఏటా కార్తీకపౌర్ణమికి ఆలయ శిఖరంపైకి చంద్రుడు వస్తాడని అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తులు తెలిపారు. పాదగయ క్షేత్రంలోని ఆలయ శిఖరంపై పౌర్ణమి చంద్రుడు నిండుగా దర్శనమిచ్చాడు.



వృద్ధులకు.. ఆర్టీసీ రాయితీ

60 ఏళ్లు దాటితే 25 శాతం వర్తింపు

» ఆరు రకాల గుర్తింపు కార్డులు
» రాష్ట్రాలతో సంబంధం లేదు
» ఏ రాష్ట్రమైనా అమలు
» డిజిటల్ గుర్తింపు కార్డుకు ఓకే
» విడుదలైన ఉత్తర్వులు
» సీనియర్ సిటిజన్స్ ఆనందం

పెద్దాపురం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): సీనియర్ సిటి జన్స్‌కు రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఏపీఎస్ ఆర్టీసీ) గుడ్‌న్యూస్ చెప్పింది. 25 శాతం రాయితీ అమలుకు కీలక ఆదేశాలు జారీ చేసింది. రాయితీ అమలుకు ఆరు రకాల గుర్తింపు కార్డులను ప్రకటించింది. వాటిలో ఏఒక్కటి చూపించినా 25 శాతం సీనియర్ సిటిజన్స్‌కు రాయితీ వర్తిస్తుందని స్పష్టం చేసింది. రాష్ట్రంతో సంబంధం లేకుండా ఏ రాష్ట్రానికి చెందిన సీనియర్ సిటిజన్స్‌కైనా ఈ రాయితీ వర్తింపచేయాలని ఏపీఎస్ఆర్టీసీ ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటికే ఆర్టీసీ అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

డిజిటల్ గుర్తింపు కార్డుకూ ఓకే..

సీనియర్ సిటిజన్స్ తమ వయస్సుకు సంబంధించిన హార్డ్ కాపీలు లేదంటే సాఫ్ట్‌కాపీల్లో ఏవి చూపించినా వాటిని అనుమతించాలని ఆదేశాల్లో స్పష్టంగా పేర్కొన్నారు. ఏపీఎస్ఆర్టీసీ నిర్వహించే అన్ని రకాల బస్సుల్లో 60ఏళ్ల నిండిన సీనియర్ సిటిజన్స్‌కు కార్పొరేషన్ 25శాతం రాయితీని పొడిగించిందని ఆదేశాల్లో పేర్కొన్నారు.ఇంకా టికెట్ కొనుగోలు సమయం, వారి ప్రయాణ సమయంలో సీనియర్ సిటిజన్ నుంచి భౌతిక రూపంలో లేదా డిజిటల్ రూపంలో (హార్డ్ కాపీ లేదా సాఫ్ట్ కాపీలు) వయస్సుకు సంబంధించిన ప్రభుత్వ గుర్తింపు కార్డులను చూపిస్తే సరిపోతుంది. సీనియర్ సిటిజన్స్ బస్సుల్లో 25 శాతం రాయితీని పొందడానికి ఆరు రకాల కార్డుల్లో ఏదైనా ఉపయోగించుకోవచ్చని ఆదేశాల్లో పేర్కొన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన గుర్తింపు కార్డుల్లో ఏదైనా అనుమతిస్తామని అధికారులు చెబుతున్నారు.ఆధార్, ఓటరు కార్డు, సీనియర్ సిటిజన్ ఐడీ కార్డ్, పాస్‌పోర్టు, పాన్ కార్డు,రేషన్‌కార్డులను అనుమతించాలని సూచించారు.

ఆదేశాలు వచ్చిన మాట వాస్తవమే

సీనియర్ సిటిజన్స్‌కు 25శాతం రాయితీని ఆర్టీసీ ప్రకటించింది. ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి.ఆరు రకాల గుర్తింపు కార్డుల్లో ఏదైనా చూపించి నిర్ధారించుకోవాల్సి ఉం టుంది. గుర్తింపుకార్డులు భౌతికంగా చూపించినా, ఫోన్‌లో చూపించినా అనుమతిస్తాం.

-మనోహర్, ఆర్టీసీ డీఎం, కాకినాడ

24న రుడా ఛైర్మన్‌గా బీవీఆర్ ప్రమాణస్వీకారం

రాజమహేంద్రవరం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్‌మెంట్ అథార్టీ(రుడా) ఛైర్మన్‌గా నియమితుడైన సీనియర్ టీడీపీ నేత, రాజానగరం టీడీపీ ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణచౌదరి (బీవీఆర్ చౌదరి) ఈనెల 24వ తేదీన ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఆ రోజు ఉదయం రాజమహేంద్రవరంలోని రుడా కార్యాలయంలో బాధ్యతలు స్వీకరిస్తారు. ఈ నేపథ్యంలో కార్తీకపౌర్ణమి సందర్భంగా శుక్రవారం టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి రాష్ట్ర మంత్రి నారా లోకేశ్‌తో కలిసి మంగళగిరిలోని పానకాల లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పూజలు చేశారు. అంతకు ముందు రుడా ఛైర్మన్‌గా తనకు అవకాశం ఇచ్చినందుకు లోకేశ్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.తన బాధ్యతలు స్వీకరణ గురించి కూడా వివరించారు.


లోకేశ్‌కు మొక్కను అందజేస్తున్న బీవీఆర్

'పోసానిని అరెస్టు చేయాలి'

దేవరపల్లి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): టీటీడీ ఛైర్మన్ బీఆర్.నాయుడుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన సినీనటుడు, వైసీపీ నాయకుడు పోసాని కృష్ణమురళీని అరెస్టు చేయాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు.దేవరపల్లి మూడురోడ్ల సెంటర్ వద్ద ఆందోళన చేసి పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ సుబ్రహ్మణ్యానికి వినతి పత్రం అందజేశారు.పోసాని అరెస్టు చేయాలన్నారు.కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు అంద్రూ అనిల్, నల్లజర్ల అధ్యక్షుడు తాతిన సత్యనారాయణ, గన్నమని హరికృష్ణ, ముళ్ళపూడి దొరాజీచౌదరి ఉప్పులూరి రాంబాబు, కాకర్ల జగదీష్,బళ్లా సూర్యచక్రం,అడబాల మణికంఠ తదితరులు పాల్గొన్నారు.



వారింట..దీపం పెడుతున్నారు!

పిఠాపురం ఒత్తులు.. దేశమంతటా వెలుగులు..

కార్తీక మాసం కావడంతో లక్షలాది మంది భక్తజనం.. గోదావరి రేవులు.. శివాలయాలు.. ఉసిరి చెట్టు.. ఇలా ప్రతి పుణ్య ప్రదేశంలో పెద్ద ఎత్తున దీపాలు పెడుతుంటారు.. ఏదో ఒక షాపుల్లో ఒత్తులు కొనుగోలు చేస్తారు.. ప్రమిదలో నూనె వేసి వెలిగించేస్తారు.. అయితే ఆ ప్రమిదలో వెలుగుతున్న ఒత్తు ఎక్కడి నుంచి వస్తుందో మాత్రం ఎవరికి తెలియదు.. ఆ ఒత్తులు వచ్చేది మన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని పవన్ కల్యాణ్ నియోజకవర్గం పిఠాపురం నుంచే.. ఒత్తుల తయారీనే వేలాది మంది మహిళలకు జీవనాధారం.కొన్ని గ్రామాల్లో ఏ ఇంటికి తలుపు తట్టినా ఒత్తులు చేస్తూ కనిపిస్తారు.. ఎందుకంటే వారింట దీపం పెట్టేది ఆ ఒత్తులే మరి..

» వేలాది మందికి ఒత్తులే ఆధారం!
» తయారీకేంద్రంగా పిఠాపురం
» ఒత్తులే కదా అని తీసిపారేయవద్దు
» కోట్లలో సాగుతున్న వ్యాపారం
» ఇతర రాష్ట్రాలకు భారీగా ఎగుమతులు



పిఠాపురం/గొల్లప్రోలు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆరనీకుమా ఈ దీపం కార్తీక దీపం.. చేర నీ పాద దీపం కర్పూరదీపం..కార్తీక మాసం వచ్చిందంటే దీపాలదే ప్రత్యేకం.. మహిళలు నిష్టగా తెల్లవారుజామునే నదుల్లో దీపాలు వదిలి పూజిస్తారు.. ఆ దీపాల్లో ఒత్తులు ఎక్కడి నుంచి వస్తున్నాయంటే టక్కున చెప్పడం కష్టమే. ఎందుకంటే దీపాలు వెలిగించడం తప్ప.. ఒత్తులు ఎక్కడి నుంచి వస్తున్నాయనేది ఆలోచించరు. ఈ ఒత్తుల తయారీ కేంద్రంగా కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గం ఉంది. సాధారణ పువ్వు ఒత్తుల నుంచి లక్ష ఒత్తుల కుందె, కోటి వత్తుల దిండు కూడా తయారు చేస్తారు. ఒత్తుల్లోనూ పలు రకాలున్నాయి. ప్రమిదల్లో ఒత్తులను ఉంచి దీపాలను తయారు చేస్తున్నారు.



వేలాది మహిళలకు ఉపాధి

పిఠాపురం నియోజకవర్గం ఒత్తుల తయారీ కేంద్రంగా ఉంది. గొల్లప్రోలు పట్టణంలో 1500 మంది మహిళలు,పిఠాపురం, గొల్లప్రోలు మండలాల్లోని బి.ప్రత్తిపాడు, బోగాపురం, విరవ, విరవాడ, చేబ్రోలు, చెందుర్తి, తాటిపర్తి సహా మరో 20 గ్రామాల్లో మరో 2,500 మంది మహిళలు ఒత్తుల తయారీ ద్వారా ఉపాధి పొందుతున్నారు. వీరిలో కొందరు మహిళలు సొంతంగా ఇంటి వద్దే ఒత్తులు తయారు చేస్తున్నారు.వీళ్లు స్థానికంగా అమ్మకాలు చేపడతారు. మరికొందరు స్థానికంగా ఒత్తుల తయారీ యూనిట్లు ఏర్పాటు చేసిన వ్యాపారుల వద్దకు వెళ్లి పనిచేస్తున్నారు. ఈ వ్యాపారులు ఇతర రాష్ట్రాలకు సైతం ఒత్తులను హోల్‌సేల్‌గా ఎగుమతి చేయడం గమనార్హం. ఉభయ తెలుగు రాష్ట్రాలతోపాటు ఒడిశా, పశ్చిమ బెంగాల్, మహారాష్ట్ర, కర్నాటక, గోవా, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్ తదితర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తారు. గొల్లప్రోలుతోపాటు పిఠాపురం నియోజకవర్గం మొత్తం మీద కోట్లలో వ్యాపారం జరుగుతూ ఉంటుంది.

టన్ను దారం రూ.1.50 లక్షలు

ఒత్తుల తయారీకి వినియోగించే దారం తమిళనాడులోని కోయంబత్తూరు నుంచి వస్తోంది. అక్కడ టన్ను దారాన్ని రూ.లక్ష నుంచి రూ.1.30 లక్షల వరకూ కొనుగోలు చేస్తారు. అత్యంత నాణ్యత కలిగిన దారం రూ.1.50 లక్షల వరకూ ఉంది. ఇలా తెచ్చిన దారాన్ని యంత్రాల సహాయంతో వడికి ఒత్తులకు అనుగుణంగా తయారు చేస్తారు. వీటిని మహిళలు ఒత్తులుగా తయారు చేస్తారు. తయారీ యూనిట్ల నిర్వాహకుల నుంచి ఈ దారాన్ని తీసుకుని ఇళ్ల వద్ద ఒత్తులు తయారు చేసి ఇస్తారు. కొందరు వ్యాపారులు తమ వద్దే ఒత్తులను తయారు చేయిస్తున్నారు. సాధారణంగా దీపంలో ఒకటి లేదా మూడు ఒత్తులు వినియోగిస్తారు. వీటితో పాటు 365 వత్తులు, 1008 ఒత్తులు, 10008 ఒత్తులు, లక్ష ఒత్తుల కుందె, కోటి ఒత్తుల దిండును తయారు చేస్తారు. వత్తుల్లో పువ్వొత్తులు, అయ్యప్ప ఒత్తులు, శివ సహస్రనామ ఒత్తులు, శివ జ్యోతులు, శివ ఢమరుకం ఒత్తులు, అఖండ ఒత్తులు, ఆకాశ దీపాలు తదితర రకాలున్నాయి. మహిళలు చేతితో మాత్రమే తయారు చేయగల పువ్వు ఒత్తులకు డిమాండ్ అధికంగా ఉంటుంది. ఆలయాల్లో వీటి వినియోగం ఎక్కువ. చేతితోనే చేయాల్సి ఉండడంతో స్థానిక మహిళలకు ఆర్డర్ ఇచ్చి తయారు చేయించుకుంటారు.

రకరకాల ఒత్తులు..

కోటి ఒత్తుల దిండు మూడు కిలోల నుంచి 18 కిలోల బరువు ఉంటుంది.18 కిలోలు ఉన్న కోటి ఒత్తుల దిండును రూ.3 వేల నుంచి రూ.4,500 వరకూ విక్రయిస్తారు. సాధారణ 3-4 కిలోల కోటిఒత్తుల దిండు ధర రూ.500 నుంచి రూ.600 వరకూ ఉంటాయి. మిగిలిన వాటి ధరలకు వాటి నాణ్యత, సంఖ్య ఆధారంగా ఉంటుంది.దారం ఒడికి తయారు చేసిన ఒత్తులను ప్రమిదల్లో ఉంచి నెయ్యి లేదా దీపం నూనె వేసి ప్యాకింగ్ చేస్తారు. 365 ఒత్తులతో తయారు చేసే దీపం ప్రమిదకు డిమాండ్ ఎక్కువగా ఉంటుంది.కోటి ఒత్తుల దిండు, లక్ష ఒత్తుల కుందెలను ఆర్డర్‌పై తయారు చేయించుకుంటారు. ప్రమిదల్లో ఒత్తుల పెట్టి తయారు చేసిన దీపాలకు ఇతర రాష్ట్రాల్లో అధికంగా డిమాండ్ ఉంది.



కిలో ఒత్తుల తయారీకి రూ.150



ఇంట్లో పనులు పూర్తి చేసుకుని ఒత్తులను తయారు చేస్తాం. కిలో పువ్వు ఒత్తులను తయారు చేసి ఇస్తే రూ.150 ఇస్తారు. ఇంట్లో పనిని బట్టి ఒత్తులు తయారీ ఆధారపడి ఉంటుంది. నాతో పాటు పలువురు మహిళలు ఇళ్లవద్దే ఒత్తులు తయారు చేస్తున్నారు. దీనివల్ల అదనపు ఆదాయం వచ్చి కుటుంబ పోషణలో ఉపయోగపడుతోంది. మా కుటుంబంలో ఇతర ఖర్చులకు సరిపోతాయి.

- రంగనాథం చంద్రకాంతం, ఈబీసీ కాలనీ, గొల్లప్రోలు

ఇక్కడ ఒత్తులకు ఇతర రాష్ట్రాల్లో డిమాండ్



మన దగ్గర తయారయ్యే ఒత్తులకు ఇతర రాష్ట్రాల్లో డిమాండ్ ఉంది.ఆర్డర్ ఇచ్చి తయారు చేయించుకుంటారు. పువ్వు ఒత్తులతో పాటు 365 ఒత్తులు, 1008 ఒత్తులు, లక్ష ఒత్తుల కుందె, కోటి ఒత్తుల దిండులకు డిమాండ్ ఎక్కువ. ప్రమిదల్లో ఒత్తులు పెట్టి తయారు చేసే దీపాలను అధికంగా కొనుగోలు చేస్తారు. ప్రభుత్వం ప్రోత్సహిస్తే మరింత ఎక్కువమందికి ఉపాధి లభిస్తుంది. **-మురాలశెట్టి బాబు, యూనిట్ నిర్వాహకుడు**

వేడుకగా గిరిప్రదక్షిణ

- సత్యదేవ నామస్మరణతో మార్మోగిన రత్న, సత్యగిరులు
- ఉదయం పల్లకీ సేవ
- మధ్యాహ్నం సత్యరథం వెంబడి పాల్గొన్న లక్షా50వేలమంది

అన్నవరం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): సత్యదేవుడు కొలువైన రత్న, సత్యగిరిలు శుక్రవారం జై సత్యదేవ నామస్మరణతో మార్మోగిపోయింది. కార్తీకపౌర్ణమి పర్వదినం సందర్భంగా శుక్రవారం నిర్వహించిన స్వామివారి గిరిప్రదక్షిణకు రాష్ట్ర నలుమూలలనుంచి లక్షా50వేల మంది విచ్చేయడంతో రోడ్డంతా భక్తులతో నిండిపోయింది.

ఈ ఏడాది నూతనంగా సత్యదేవుడు, అనంతలక్ష్మి అమ్మవార్లను ఉదయం 8గంటలకు పల్లకిలో, సత్యరథం భక్తులతో మధ్యాహ్నం రెండు గంటలకు గిరియాత్ర ప్రారంభించారు. ఉదయం 7.30 గంటలకు కొండపై నుంచి స్వామి,అమ్మవార్లను పల్లకిలో మెట్లమార్గం గుండా కొండదిగువున తొలిపావంచా వద్దకు తోడ్కొనివచ్చారు. అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం ఈవో రామచంద్రమోహన్, చైర్మన్ రోహిత్ స్వామి వారి పల్లకీ సేవ ద్వారా గిరిప్రదక్షిణ ప్రారంభించారు. స్వామి, అమ్మవార్లను పల్లకిలో పండితుల మంత్రోచ్చారణలతో స్వల్పంగా హాజరైన భక్తులతో ఈ గిరియాత్ర తొలిపావంచా నుంచి జాతీయ రహదారి మీదుగా బెండపూడి సమీపంలో పుష్కరకాలువ రోడ్డుగుండా 9.2 కిలోమీటర్లమేర గిరిప్రదక్షిణ సాగింది.



గిరిప్రదక్షిణలో సత్యరథం

గోవిందనామ స్మరణతో గిరిప్రదక్షిణ

మధ్యాహ్నం సత్యరథం ద్వారా ప్రదక్షిణకు భక్తులు సత్య, రత్నగిరికొండల వెంట నడిచారు. కొండలు, గుట్టలు దాటుకొని గోవిందనామ స్మరణల నడుమ భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. లక్షా 50వేలమంది వరకు హాజరయ్యారు. దేవస్థానం, దాతల సహకారంతో పండ్లు, మజ్జిగ, బిస్కెట్ ప్యాకెట్ల స్టాల్స్ ఏర్పాటు చేసినా ఉదయం పాల్గొన్న భక్తులతో కొంత ఖాళీఅయ్యాయి. దేవస్థానం తరఫున 3లక్షల మంచినీరు ప్యాకెట్లను పీఆర్వో విభాగం అందుబాటులో ఉంచారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఈవో రామచంద్రమోహన్, చైర్మన్ రోహిత్ వాకీటాకీల ద్వారా సమాచారం తెలుసుకుని అధికారులకు సూచనలు చేశారు. మార్గమధ్యలో వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి వైద్యసేవలందించారు.

స్తంభించిన ట్రాఫిక్

గిరియాత్రకు తరలి వచ్చిన భక్తులతో ట్రాఫిక్ స్తంభించింది. కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. ప్రత్తిపాడు సీఐ సూరి అప్పారావు ఆధ్వర్యంలో పోలీసులు ట్రాఫిక్ క్రమబద్ధీకరణ చేపట్టారు. పంపాతీరం వద్ద ప్రదక్షిణయాత్ర ముగిసింది. ప్రత్యేక మండపంలో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి చతుర్వేద పండితుల వేదస్వస్తి, భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.



ఉదయం స్వామి, అమ్మవార్లకు పల్లకీ సేవ నిర్వహిస్తున్న ఆలయ సిబ్బంది

ఈ ఏడాది ముందు జాగ్రత్తలతో మధ్యాహ్నం గిరియాత్ర చేపట్టాలనే ఆలోచన సత్ఫలితాలు ఇచ్చాయి. ఆలయ ఆచార సంప్రదాయాలను గౌరవిస్తూ ఉదయం పల్లకీలో స్వామి,అమ్మవార్లకు మధ్యాహ్నం భక్తులతో సత్యరథం గిరియాత్ర చేపట్టారు. గిరియాత్ర విజయవంతంతో సిబ్బందిని ఈవో, చైర్మన్లు అభినందించారు. స్టాల్స్ ఏర్పాట్లు సూపరింటెండెంట్ బలువు సత్యశ్రీనివాస్ పర్యవేక్షణలో తలుపులయ్య, గణపతి ఏర్పాటు చేశారు.

శోభాయమానంగా పంపా హారతులు

కార్తీకపౌర్ణమి సందర్భంగా శుక్రవారం రాత్రి పంపా హారతుల కార్యక్రమం శోభాయామానంగా జరిగింది. రాత్రి 6.30 గంటలకు స్వామి,అమ్మవార్లను కొండపై నుంచి మేళతాలాలు, పండితుల మంత్రోచ్చారణల నడుమ పంటుపై ఆశీనులు గావించారు. నదీమతల్లికి పసుపు, కుం కుమ, చీర సమర్పించారు. అర్చకస్వాములు పంపానదికి ఏడు రకాలైన ఏకహారతి, నేత్రహారతి, బిల్వహారతి, సర్పహారతి, కుంభహారతి, నక్షత్ర హారతి, కర్పూరహారతి ఇచ్చారు. చతుర్వేదపండితుల వేదాశీర్వచనంతో ముగిసింది.ఈవో రామచంద్రమోహన్, చైర్మన్ రోహిత్ పాల్గొనగా వైదికకార్యక్రమాలను ప్రధానార్చకులు కోట సుబ్రహ్మణ్యం, ఇంద్రగంటి నరసింహమూర్తి రుత్విక్‌లు చామర్తి కన్నబాబు, పాలంకి పట్టాభి నిర్వహించారు.

జ్వాలాతోరణం ఇలా..



జ్వాలాతోరణం నిర్వహిస్తున్న అర్చకస్వాములు

కార్తీకపౌర్ణమి సందర్భంగా కొండదిగువున తొలిపావంచా వద్ద జ్వాలాతోరణం కార్యక్రమం వేడుకగా జరిగింది. పంపా హారతుల తరువాత స్వామి,అమ్మవార్లను తొలిపావంచా వద్దకు తోడ్కొనివచ్చారు. ఇరువైపులా ఎండుగడ్డితో తోరణాన్ని ఏర్పాటు చేశారు. ముందుగా స్వామి,అమ్మవార్లకు ప్రత్యేక పూజలు అనంతరం అర్చకస్వాముల వేదమంత్రాల నడుమ తోరణానికి నిప్పంటించారు. వాటి మధ్యలో పల్లకీలో స్వామి, అమ్మవార్లను ముమ్మారు ప్రదక్షిణ చేయించారు. ఈ సందర్భంగా తోరణంనుంచి జ్వాల అనంతరం వెలువడిన భస్మం కోసం భక్తులు పోటీపడ్డారు. ప్రత్తిపాడు సీఐ సూరి అప్పారావు ఆధ్వర్యంలో పోలీసులు ట్రాఫిక్‌ను జాతీయ రహదారి మీదుగా మళ్లించారు.



నింగి.. వంగి! నింగి వంగిందా..? అన్నట్టుగా ఆకాశంలో సప్తవర్ణాల హరివిల్లు కనిపిస్తోంది కదూ.. ప్రకృతిలో ఎన్నో అందాలు.. వాటిలో ఇంద్రధనస్సు అత్యద్భుతం.. కాకినాడ జిల్లా తేటగుంట హైవే వద్ద శుక్రవారం ఉదయం కనువిందు చేసిన ఈ దృశ్యాన్ని ఆంధ్రజ్యోతి క్లిక్ మనిపించింది. -ఫొటోగ్రాఫర్, కాకినాడ

పట్టభద్రుల ఓటు నమోదు చేసుకోవాలి

- డిసెంబరు 9 వరకు అవకాశం
- ఓటు దరఖాస్తుకు గెజిటెడ్ సంతకం అవసరం లేదు
- ఓటరు వెరిఫికేషన్‌లో ఒరిజినల్ సర్టిఫికెట్ చూపించాలి
- కాకినాడ జిల్లా కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), నవంబరు 15(ఆంధ్రజ్యోతి): తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీకి ఓటు నమోదుకు డిసెంబరు 9వతేదీ వరకు అవకాశం ఉందని కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. కాకినాడ కలెక్టరేట్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఓటు నమోదుకు డిగ్రీ జిరాక్స్ పత్రాలను ఇచ్చే సమయంలో గెజిటెడ్ సంతకం అవసరం లేదన్నారు. ఓటరు వెరిఫికేషన్‌కు బీఎల్‌వోలు ఇంటికి వచ్చినప్పుడు తనిఖీ అధికారికి ఒరిజినల్ డిగ్రీ సర్టిఫికెట్‌ను చూపించాలన్నారు. లేనిపక్షంలో అప్పుడు గెజిటెడ్ అధికారి ధ్రువీకరించిన జిరాక్స్ పత్రాన్ని ఇవ్వాలన్నారు. పదో తరగతి చదివిన తర్వాత ఇంటర్మీడియట్ చదవకుండా డిస్టెన్స్ ఎడ్యుకేషన్ ద్వారా డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులకు కూడా ఓటు నమోదు చేసుకునేందుకు అర్హత ఉందన్నారు. ఈనెల 23న ఓటర్ల డ్రాఫ్ట్ పబ్లికేషన్ జరుగుతుందన్నారు. వచ్చేనెల 30న ఓటర్ల తుది జాబితా ప్రచురణ జరుగుతుందన్నారు. పట్టభద్రుల ఓటుకు ఇప్పటివరకు 2,96,643 దరఖాస్తులు వచ్చాయన్నారు. దీనిలో అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి 4064, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా నుంచి 62,862, తూర్పుగోదావరి జిల్లానుంచి 58,561, ఏలూరుజిల్లానుంచి 41196, కాకినాడ జిల్లానుంచి 62200, పశ్చిమగోదావరి జిల్లానుంచి 67760 దరఖాస్తులు వచ్చాయన్నారు. దరఖాస్తులను పరిశీలించిన తర్వాత ఓటు నమోదు జరుగుతుందన్నారు.

విద్యార్థులకు నైతిక విలువలు నేర్పించడం గొప్ప బాధ్యత

- నైతిక విలువల ప్రభుత్వ సలహాదారు చాగంటి
- మర్యాదపూర్వకంగా కలిసిన రాష్ట్ర సమగ్ర శిక్ష పీడీ, ఆర్జేడీ



చాగంటి దంపతులకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న పీడీ శ్రీనివాసరావు, ఆర్జేడీ నాగమణి

కాకినాడ రూరల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నైతిక విలువలు నేర్పించడం గొప్ప బాధ్యతని నైతిక విలువల ప్రభుత్వ సలహాదారు చాగంటి కోటేశ్వరరావు అన్నారు. ప్రభుత్వ ప్రతినిధిగా రాష్ట్రసమగ్ర శిక్ష పీడీ బి.శ్రీనివాసరావు, ఆర్జేడీ జి.నాగమణి శుక్రవారం చాగంటి దంపతులను కాకినాడ రూరల్ మండలం తిమ్మాపురంలోని గోశాల సమీపంలోని నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చాగంటి మాట్లాడుతూ విద్యార్థులకు నైతిక విలువల ప్రభుత్వ సలహాదారుడిగా తనను నియమించినందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. తన పదవీ కాలంలో విద్యార్థి లోకానికి సత్ప్రవర్తన, మంచి నడవడిక, నైతిక విలువలతో నేర్పే కర్తవ్యాన్ని తనకు అప్పగించినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారని, త్వరలో విద్యాశాఖా మంత్రి నారాలోకేశ్‌ను కలుస్తామని చెప్పినట్లు పీడీ శ్రీనివాసరావు తెలిపారు.

ఇక పుష్కలంగా ఉచిత ఇసుక

- వేమగిరి, తీపర్రు-3 రీచ్‌లను జిల్లాకు కేటాయించిన ప్రభుత్వం
- కాకినాడ రూరల్, పెద్దాపురం, గొల్లప్రోలుల్లో స్టాక్ యార్డులు
- 24 నుంచి ఇసుక అందుబాటులోకి..
- కాకినాడ రూరల్, పెద్దాపురంల్లో టన్ను ఇసుక రూ.600
- గొల్లప్రోలు యార్డులో టన్ను రూ.582
- కాకినాడ జిల్లా కలెక్టర్ వెల్లడి



విలేకరులతో మాట్లాడుతున్న కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్(కాకినాడ), నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ఇక నుంచి జిల్లాలో పుష్కలంగా ఇసుక లభించనుందని, కాకినాడ జిల్లాకు తూర్పుగోదావరి జిల్లాలోని వేమగిరి, తీపర్రు-3 రీచ్‌లను ప్రభుత్వం కేటాయించిందని కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ వెల్లడించారు. కాకినాడ కలెక్టరేట్‌లో శుక్రవారం ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇతర జిల్లా అయిన తూర్పుగోదావరి జిల్లాలోని కడియం మండలంలో ఉన్న వేమగిరి రీచ్‌ను, పెరవలి మండలంలో తీపర్రు-3 రీచ్‌ల్లో ఇసుక కాకినాడ జిల్లాకు కేటాయించారన్నారు. ఈ రీచ్‌ల్లో ఉన్న ఇసుకను కాకినాడ జిల్లాలో ప్రజల అవసరాల నిమిత్తం తరలించి తీసుకొస్తామన్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో కాకినాడ రూరల్, పెద్దాపురం, గొల్లప్రోలుల్లో ఇసుక స్టాక్ యార్డులను ఏర్పాటు చేస్తున్నామన్నారు. దీనికోసం రీచ్ ఆపరేటింగ్ ఏజెన్సీలను ఖరారు చేశామన్నారు. ఇసుక స్టాక్ యార్డు నిర్వహణకు ఏజెన్సీల టెండర్లు పిలిచి ఈనెల 22తేదీకి లైసెన్సులు ఖరారు చేస్తామన్నారు. ఈ తర్వాత ఈనెల 24, 25 తేదీలకు స్టాక్ యార్డులలో ఇసుక అందుబాటులోకి వస్తుందన్నారు. వినియోగదారులు నిర్మాణాల నిమిత్తం ఇసుకను రీచ్‌లనుంచి గానీ, స్టాక్ యార్డుల నుంచి గానీ పొందవచ్చునన్నారు. ఇసుక తవ్వకం, రవాణా, నిల్వల నిర్వహణకు అయ్యే ఖర్చులను మాత్రమే చెల్లిస్తే సరిపోతుందన్నారు. టన్ను ఇసుకను కాకినాడ, పెద్దాపురం స్టాక్ యార్డుల్లో రూ.600గా, గొల్లప్రోలు యార్డులో రూ.582గా నిర్ణయించామన్నారు.

వినియోగదారులు నేరుగా ఇసుకను ఎస్ఎఎస్‌డి.ఏపీ.జీవోవీ.ఐఎన్ వెబ్‌సైట్ ద్వారా ఏపీ శాండ్ మేనేజ్ మెంట్ సిస్టమ్ వెబ్‌పోర్టల్ నుంచి తమ ఆధార్ వివరాలతో బుక్ చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్ ద్వారా ఇసుక బుక్ చేసుకునే విధానాన్ని ఆయన వివరించారు. ఆఫ్‌లైన్ అంటే స్వయంగా ఇసుక రీచ్‌ల దగ్గర నుంచిగానీ, ఇసుక స్టాక్ యార్డుల వద్దకు వెళ్లి తగిన సొమ్ములు చెల్లించి ఇసుకను పొందవచ్చునన్నారు. తీపర్రులో లోడింగ్ చార్జీలు టన్నుకు రూ.96, వేమగిరిలో లోడింగ్ చార్జీలు టన్నుకు రూ.61.30 అవుతుందన్నారు. లోడింగ్, రవాణా, స్టాక్‌యార్డు సెక్యూరిటీ, సీసీ కెమేరాల నిర్వహణ వంటికి అన్నింటికి వ్యయం అవుతుందన్నారు. ఈ నేపథ్యంలో టన్ను రూ.600లకు రెండు యార్డులలో, టన్ను రూ.582కి ఒక యార్డులో వినియోగదారులకు లభిస్తుందన్నారు. జిల్లాలో భవన నిర్మాణాలు, రోడ్ల నిర్మాణాలు, ఇతర నిర్మాణాలు నిలిచిపోకుండా ఉండాలనే లక్ష్యంతో ఉచిత ఇసుకను అందుబాటులోకి ప్రభుత్వం తెచ్చిందన్నారు. ఇసుక పొందే క్రమంలో ఏమైనా ఇబ్బందులుంటే తమను సంప్రదించాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు, సమాచారశాఖ డీడీ నాగార్జున పాల్గొన్నారు.

భక్తజనసంద్రంగా సత్యదేవుడి సన్నిధి

- రూ.1.20 కోట్లు ఆదాయం



ఆలయంలో వ్రతాలాచరిస్తున్న భక్తులు

అన్నవరం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసంలో పౌర్ణమి సందర్భంగా సత్యదేవుడి సన్నిధి శుక్రవారం భక్తజనసంద్రంగా మారింది. స్వామివారి దర్శనానికి గురువారం రాత్రికే చేరుకున్న భక్తులకు 10గంటలకు వ్రతం టిక్కెట్లు విక్రయించి 12:30కి వ్రతాలు ప్రారంభించారు. ఒకపక్క గిరిప్రదక్షిణకు హాజరైన భక్తులు, స్వామివారి వ్రతమాచరించేందుకు విచ్చేసిన భక్తులతో ఎక్కడ చూసినా భక్తజన సమూహమే కనిపించింది. కార్తీకపౌర్ణమి రోజున స్వామివారికి వివిధ విభాగాల ద్వారా రూ.1.20కోట్ల ఆదాయం లభించింది. అధికారులు చేపట్టిన ముందస్తుచర్యలు సత్ఫలితాలనిచ్చాయి. శుక్రవారం ఒక్కరోజు 9,995 వ్రతాలు జరిగాయి. ప్రత్యేక దర్శనానికి రెండు గంటలు, ఉచిత దర్శనానికి మూడు గంటల సమయం భక్తులు క్యూలైన్‌లో వేచియున్నారు.

కేన్సర్ వ్యాధి తాళలేక మహిళ ఆత్మహత్య

- కాలువలో దూకి బలవన్మరణం
- తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలులో ఘటన



కాలువలో మృతదేహం

బిక్కవోలు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): కేన్సర్ వ్యాధి తాళలేక ఓ మహిళ ఆత్మహత్య చేసుకుంది. ఈ మేరకు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తూర్పుగోదావరి జిల్లాలోని బిక్కవోలులోని పిండాల రేవులో కొట్టుకు వస్తున్న ఒక మృతదేహాన్ని శుక్రవారం సాయంత్రం ఎస్ఐ వి.రవిచంద్రకుమార్ కనుగొన్నారు. మృతదేహాన్ని బయటికి తీసుకువచ్చి విచారణ చేపట్టారు. ఈ క్రమంలో మృతురాలి కుమార్తె వచ్చి తనతల్లి బుద్దాల నాగశ్రీ(50) రెండేళ్లుగా కేన్సర్‌తో బాధ పడుతోందని, రాజమహేంద్రవరం జీఎస్ఎల్ ఆస్పత్రిలో చికిత్స చేయిస్తున్నామని తగ్గకపోవడంతో జీవితంపై విరక్తి చెంది తనకు చివరిసారిగా ఫోన్ చేసి అన్నయ్యను జాగ్రత్తగా చూసుకోమని ఫోన్ చేసి పెట్టేసిందని, ఇంటికి వెళ్లి చూడగా ఆమె కనిపించలేదని, చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదని చెప్పింది. బిక్కవోలు పిండాల రేవు వద్ద ఒక మృతదేహం ఉందని తెలిసి రావడంతో ఆమె తన తల్లిగా గుర్తించింది. దీంతో పోలీసులు మృతదేహానికి అనపర్తి ఏరియా ఆసుపత్రిలో పోస్టుమార్టమ్ నిర్వహించి బంధువులకు అప్పగించారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు

- ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్



గోకవరం పోలీస్‌స్టేషన్‌లో మొక్కనాటుతున్న ఐజీ అశోక్‌కుమార్

కోరుకొండ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): జూదాలు, గంజాయి, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఆయన నార్త్‌జోన్‌పరిధిలోని తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ, గోకవరం పోలీస్‌స్టేషన్‌లను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీసీ కెమెరాల ఏర్పాటు పెద్దఎత్తున జరగాలని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలే కాకుండా ప్రైవేట్ వ్యక్తులను ప్రోత్సహించి ఎక్కువ సీసీ కెమెరాలను ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. జూదాలు, ఇతర అసాంఘిక కార్యకలాపాలపట్ల స్థానిక పోలీసులు సరిగా స్పందించకపోతే స్పెషల్ ప్రొటెక్షన్ టీంలు రంగంలోకి దిగుతాయన్నారు. ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ పోలీసులు కేసులు నమోదు చేస్తే స్థానిక పోలీసులపై చర్యలు తీసుకుంటామన్నారు. జూదాలు, పేకాట, కోడిపందేలు, గంజాయి రవాణా, ఇతర మాదక ద్రవ్యాల రవాణా వంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలను ఉక్కుపాదంతో అణచివేస్తామన్నారు. ఐజీ వెంట జిల్లా ఎస్పీ నరసింహకిషోర్, నార్త్‌జోన్ ఇన్‌చార్జి డీఎస్పీ టి.దేవకుమార్, సీఐ వై.సత్యకిషోర్, ఎస్ఐ టి.శ్యామ్‌సుందర్, ఇతర సిబ్బంది ఉన్నారు.

పాలంగిలో చండీహోమం, రుద్రయాగం

- పాల్గొన్న కేంద్రమంత్రి శ్రీనివాసవర్మ

ఉండ్రాజవరం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా ఉండ్రాజవరం మండలంలోని పాలంగి గ్రామంలో నెలటూరుకు చెందిన ఉమారామలింగేశ్వర ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈనెల 1వ తేదీ నుంచి 15వరకు అష్టవాజపేయ మహాయాగం సందర్భంగా జరిగిన చండీహోమం, రుద్రయాగ కార్యక్రమంలో కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ ఆఖరి రోజైన శుక్రవారం పాల్గొన్నారు. కుంకుమ పూజలు, దీపోత్సవం నిర్వహించారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా జరిగిన ప్రత్యేక పూజల కార్యక్రమంలో పలువురు నాయకులు, భక్తులు పాల్గొన్నారు. యాగ నిర్వాహకుడు జంధ్యాల శ్రీనివాస సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో నిర్వహించిన పూజలు అనంతరం అన్నసమారాధన నిర్వహించారు.



పూజా కార్యక్రమంలో పాల్గొన్న కేంద్రమంత్రి

వ్యక్తి ఆత్మహత్య

శృంగవరపుకోట, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లా ఎస్.కోట పట్టణంలోని శ్రీనివాసకాలనీలో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు అందించిన వివరాల ప్రకారం తూర్పుగోదావరి జిల్లా ఆత్రేయపురం మండలం నార్కేడిమిల్లి గ్రామానికి చెందిన సీహెచ్ నాగేంద్ర శ్రీనివాస కాలనీలో ఉంటున్నాడు. అతని భార్య గర్భవతి కావడంతో పుట్టింటికి వెళ్లింది. కొన్నాళ్లుగా ఆయన ఇంట్లో ఒంటరిగా ఉంటున్నాడు. నాగేంద్ర భార్య శుక్రవారం ఉదయం నుంచి ఫోన్ చేస్తున్నా లిఫ్ట్ చేయకపోవడంతో ఎస్.కోటలో వేరేచోట ఉన్న బంధువులకు చెప్పింది. దీంతో వారు ఇంటికి వచ్చి పిలిచారు. తలుపులు కొడితే తెరవలేదు. కిటికిలో నుంచి చూస్తే నాగేంద్ర ఉరేసుకుని కనిపించాడు. వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ వీఎస్ మూర్తి తెలిపారు. భార్య, అతడి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చామన్నారు.

పట్టువస్త్రాలు పంపిన డిప్యూటీ సీఎం పవన్

- పాదగయ, మహాసంస్థానంలో సమర్పణ... ప్రత్యేక పూజలు

పిఠాపురం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం పాదగయ క్షేత్రంలో స్వామి,అమ్మవార్లకు, శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానానికి డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పట్టువస్త్రాలు సమర్పించారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా ప్రజలంతా శాంతి, సౌభాగ్యాలతో సుభిక్షంగా ఉండాలని... రాష్ట్రానికి, పిఠాపురం నియోజకవర్గ ప్రజలకు మంచి జరగాలని కోరుకుంటూ ఆయన ఈ పట్టువస్త్రాలను ప్రత్యేకంగా పంపారు. పవన్ పంపిన పట్టువస్త్రాలను పాదగయక్షేత్రంలో స్వయంభూ కుక్కుటేశ్వరస్వామి, రాజరాజేశ్వరీ దేవి, అష్టాదశ శక్తి పీఠాల్లో దశమ శక్తి పీఠం అధిష్ఠాన దేవతైన పురుహూతికాఅమ్మవార్లకు జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు, పండ్లు సమర్పించారు. వాటిని స్వామి, అమ్మవార్లకు అలంకరించారు. అనంతరం శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానంలో శ్రీపాదశ్రీవల్లభులు, దత్తాత్రేయస్వామి, నృసింహ సరస్వతులకు పవన్ పంపిన పట్టువస్త్రాలను మర్రెడ్డి శ్రీనివాసరావు సమర్పించారు. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య పూజలు నిర్వహించి వాటిని స్వామికి అలంకరించారు.



పిఠాపురం పాదగయ క్షేత్రంలో స్వామి, అమ్మవార్లకు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పంపిన పట్టువస్త్రాలను తీసుకువెళ్తున్న జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు



పిఠాపురం శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానంలో పవన్ పంపిన పట్టువస్త్రాలు తీసుకువెళ్తున్న మర్రెడ్డి శ్రీనివాసరావు

ప్రజా సమస్యలు పరిష్కరించాలని ధర్నా

కలెక్టరేట్(కాకినాడ), నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను పరిష్కరించాలని సీపీఎం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. సీపీఎం జిల్లా కన్వీనర్ రాజశేఖర్, జిల్లా సీనియర్ నేత దువ్వా శేషబాబ్జి, నగర కమిటీసభ్యుడు సత్తిరాజు, నగర కన్వీనర్ పలివెల వీరబాబు మాట్లాడుతూ నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలని కోరారు.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

వేణుగోపాలస్వామి గ్రామోత్సవం

పిఠాపురం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలో వేంచేసి ఉన్న రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా స్వామి అమ్మవార్లకు శుక్రవారం చక్రస్నానం నిర్వహించారు. చక్రస్నానానికి భక్తులు భారీగా తరలివచ్చారు. అనంతరం గరుడ వాహనంపై గ్రామోత్సవం జరిగింది. ఆలయ అర్చకుడు పి.విజయజనార్ధనాచార్యులు పూజాది కార్యక్రమాలు నిర్వహించగా, ఈవో నున్న శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి అందజేత

గొల్లప్రోలు రూరల్, నవంబరు 15: ఆపదలో ఉన్న వారికి డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అండగా ఉంటారని జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు తెలిపారు. పిఠాపురం మండలం గోకివాడకు చెందిన గాది వెంకటరమణ ప్రమాదవశాత్తు మరణించగా అతడి కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.1,98,872లు మంజూరైంది. ఈ మొత్తాన్ని శుక్రవారం చేబ్రోలులోని పవన్‌కల్యాణ్ నివాసం వద్ద వెంకటరమణ కుటుంబానికి మర్రెడ్డి అందజేశారు. జనసైనికులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కొత్తపల్లి: ట్రాక్టర్ ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న నాగులాపల్లికి చెందిన చింతపల్లి నేరేళ్ళకు మంజూరై సీఎం సహాయ నిధి రూ.98.916వేల చెక్కును జనసేన పిఠాపురం ఇన్‌చార్జి మర్రెడి శ్రీనివాస్ బాధితుడి కుటుంబానికి అందజేశారు. జనసేన నాయకులు మత్సా అప్పాజీ, తెలగంశెట్టి వెంకటేశ్వరరావు, పెనుమల్లు సత్యానందరెడ్డి పాల్గొన్నారు.

టీడీపీ నేతల హర్షం

తాళ్లరేవు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజును ప్రభుత్వ విప్‌గా నియమించిన సందర్భంగా గాడిమొగలో శుక్రవారం టీడీటీ గ్రామకమిటీ అధ్యక్షుడు సంగాడి కామేశ్వరరావు ఆధ్వర్యంలో టీడీపీ నేతలు పెసింగి ఈశ్వరరావు, లంకే నూకరాజు కేక్ కట్ చేసి హర్షం వ్యక్తం చేశారు. మల్లాడి వరదరాజు, సీతారామరాజు, గంగాధరరావు, పెసింగి నాగబాబు, అంగాడి తాతారావు, సంగాడి అన్నవరం, లంకే వీరబాబు, సబ్బతి సింహాద్రి, పినపోతు నాగేశ్వరరావు, పెమ్మాడి వీరబాబు, ఓలేటి జగదీష్, పోతాబత్తుల రాంబాబు,కామాడి సూర్యనారాయణ ఉన్నారు.

1న శెట్టిబలిజ కార్తీక వనసమారాధన

కాకినాడ సిటీ, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): డిసెంబరు 1న కాకినాడ సాంబమూర్తినగర్ సమీపంలోని రెవెన్యూ కాలనీలోని శెట్టిబలిజ కమ్యూనిటీ హాల్ స్థలంలో నిర్వహించే శెట్టిబలిజ కార్తీక వనసమారాధన కార్యక్రమంలో సంఘీయులందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆహ్వాన కమిటీ కన్వీనర్ గెద్దాడ వెంకటేశ్వరరావు, కమిటీ సభ్యులు పితాని నూకరాజు, రాయుడు వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. శుక్రవారం కార్తీవనసమారాధన పోస్టర్‌ను ఆవిష్కరించి విలేకరులతో మాట్లాడారు. రాజకీయ పార్టీలకతీతంగా ఈ వనమహోత్సవంలో సంఘీయులంతా పాల్గొని ఐక్యతను చాటాలని కోరారు. కార్యక్రమంలో ఆహ్వాన కమిటీ సభ్యులు పితాని శ్రీనివాసరావు, చింతాకుల శ్రీనివాస్, పెంకే రవి, ఎల్లబోయిన చిన్న, పిల్లి శ్రీనివాస్, కాకరపల్లి చంద్రశేఖర్, అంగటి అంజిబాబు, బత్తిన నూకరాజు పాల్గొన్నారు.

బాలల వేషధారణలు



కాకినాడ రూరల్, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): బాలల దినోత్సవం సందర్భంగా కాకినాడ సెయింట్ ఆంథోని పాఠశాలల్లో నిర్వహించిన బాలలు ప్రదర్శించిన దేశభక్తి నాయకుల వేషధారణలు ఆకట్టుకున్నాయి. పాఠశాలల కరస్పాండెంట్ రోహిత్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలలో పాఠశాల సొసైటీ సభ్యులు డాక్టర్ సత్యనారాయణమూర్తి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పలు సాంస్కృతిక, క్రీడా పోటీల్లోని విజేతలకు బహుమతులు అందజేశారు.

అరుదైన శస్త్రచికిత్స

కార్పొరేషన్(కాకినాడ), నవంబరు 15(ఆంధ్రజ్యోతి): కాకినాడ అపోలో ఆస్పత్రిలో అరుదైన చికిత్స విజయవంతంగా నిర్వహించామని యూనిట్ హెడ్ బీవీ.రమణ వెల్లడించారు. కాకినాడలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ ప్రమాదకర టాగి(ట్రాన్స్ క్యాథటిక్ అరోటికల్ ఇన్సలంటేషన్) అనే శస్త్రచికిత్సను అపోలో ఆస్పత్రి వైద్యబృందం డాక్టర్ టి.వెంకటేశ్వరరావు (కార్డియాలజీ), డాక్టర్ జి.సంజీవ్‌కిషన్(కార్డియాలజీ), డాక్టర్ నాగేశ్వరరావు(ఏనాస్తిషియా) 9మంది బృందంతో కలిసి విజయవంతంగా చేశారన్నారు. డీజీఎం కార్పొరేట్ మూర్తి, మార్కెటింగ్ హెడ్ అంజిబాబు పాల్గొన్నారు.

సీపీఎం ఆధ్వర్యంలో 'ప్రజాపోరు'

కరప, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): అడ్డు అదుపు లేకుండా పెరిగిపోతున్న నిత్యావసర ధరలను నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో ప్రజాపోరు కార్యక్రమం చేపడుతున్నట్టు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.రాజశేఖర్ తెలిపారు. కరప మండలం వలసపాకలలో శుక్రవారం పార్టీ నాయకులు సీహెచ్.రమణి, గంగాభవానీతో కలిసి ఇంటింటికీ కరపత్రాలను పంచిపెట్టారు. రాజశేఖర్ మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక నిర్ణయాలు, అధిక ధరలను నిరసిస్తూ ప్రజాపోరు తలపెట్టామన్నారు. మహిళలు, చిన్నారులు, దళితులపై అత్యాచారాలు జరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నా నిరసనలు, ధర్నాలు నిర్వహిస్తామని చెప్పారు.

అక్రమ నిర్మాణాలు ఆగవా?

మధురానగర్ పుంతరోడ్డులో అక్రమ నిర్మాణాలు
చోద్యం చూస్తున్న సిటీ టౌన్ ప్లానింగ్ అధికారులు



కాకినాడ 48వ డివిజన్‌లో రోడ్డు పక్కన అక్రమ నిర్మాణం

సర్పవరం జంక్షన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కాకినాడ కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ అధికారుల ఉదాశీన వైఖరితో రోడ్డు పక్కన అక్రమ నిర్మాణాలు 48వ డివిజన్‌లో జోరందుకుంటున్నాయి. మధురానగర్‌లో ప్రభుత్వ పోరంబోకు పుంతరహదారిలో 66 అడుగుల రోడ్డు ఉండేది, ఆక్రమణలతో నేడు 30 అడుగులకే పరిమితం కావడంతో అప్పటి కమిషనర్ స్వప్నిల్ దినకర్ సర్వే చేయించి రోడ్డు పక్కన ఆక్రమణలు తొలగింపు కోసం మార్కింగ్‌లు పెట్టించారు. ఆయన బదిలీపై వెళ్లడంతో రోడ్డు విస్తరణ అంశం అటకెక్కడంతో ఆక్రమణదారులు రోడ్డును ఆక్రమించి మరలా అక్రమ కట్టడాలు నిర్మిస్తున్నా అధికారులు పట్టించుకోకుండా వారికి సహాయ సహకారాలు అందిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

కాకినాడ రూరల్ నియోజకవర్గం పరిధిలో గల 48, 49వ డివిజన్‌లో గోకులం నుంచి ప్రభుత్వ పోరంబోకు పుంత రోడ్డు, పేట కాలువ గట్టు వరకు సుమారు కిలోమీటరు మేర 66 అడుగుల పుంతరోడ్డు ఉంది. రోడ్డు పక్క నివాసితులు క్రమేణా రోడ్డుపక్కన ఖాళీగా ఉన్న స్థలంలోకి భవనాలు, ప్రహారీలు, షెడ్డులు నిర్మించి ముందుకు వచ్చేశారు. ప్రస్తుతం ఈ రోడ్డు కేవలం 30 అడుగుల లోపే ఉంది. ఈ రహదారి బిజీగా ఉండటంతో 2020-21లో అప్పటి కార్పొరేషన్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ గోకులం నుంచి పుంతరోడ్డు,పేట కాలువ రోడ్డును పరిశీలించి అక్రమ కట్టడాలను పరిశీలించి, సర్వే చేయించారు. అనంతరం పుంత రోడ్డు విస్తరణ కోసం రోడ్డు మీదుకు వచ్చేసి నిర్మించిన భవనాలు, ప్రహారీ, షెడ్లను గుర్తించి, మార్కింగ్ వేసి నివాసితులకు టౌన్‌ప్లానింగ్ అధికారులతో నోటీసులు జారీ చేశారు. తక్షణమే అక్రమ కట్టడాలను స్వచ్ఛందంగా తొలగించుకోవాలని లేదంటే కార్పొరేషన్ ఆధ్వర్యంలో అక్రమ కట్టడాలను తొలగించి, దీనికయ్యే ఖర్చులను మీ వద్ద నుంచే రాబడతామని నోటీసులో అప్పటి కమిషనర్ పేర్కొన్నారు. అక్రమ కట్టడాల తొలగింపునకు రంగం సిద్ధం అవుతున్న క్రమంలో కమిషనర్ బదిలీ కావడంతో పుంత రోడ్డు విస్తరణ పనులు అటకెక్కింది. దాంతో మళ్లీ రోడ్డును ఆక్రమించి నిర్మాణాలు జోరందుకుంటున్నాయని స్థానికులు తెలిపారు. అక్రమ నిర్మాణాలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకుని అక్రమ నిర్మాణాలను నివారించేవిధంగా నగర పాలక సంస్థ కమిషనర్ చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రభుత్వ స్థలంలో దర్జాగా ప్రైవేటు భవన నిర్మాణం

పెద్దాపురం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ స్థలాలను కాపాడాల్సిన అధికారులు మౌనంగా ఉంటున్నారు. పైగా భవన నిర్మాణాలు చేపడుతున్నా కూడా నిమ్మకు నీరెత్తినట్లు చోద్యం చూస్తున్నారు. వివరాల్లోకి వెళితే పెద్దాపురం పట్టణ పరిధిలోని స్థానిక మెయిన్ రోడ్డు వేములవారి జంక్షన్ సమీపంలో ఉన్న రెవెన్యూ స్థలంలో ఓ ప్రైవేటు ఛారిటబుల్ ఫౌండేషన్ భవన నిర్మాణం పనులు చేపట్టడం చర్చనీయాంశమైంది. ఇది అధికారిక నిర్మాణమా? లేక అనధికారిక నిర్మాణమా అనే సందేహాలు కలుగుతున్నాయి. టీఎస్ నంబర్ 4-1-3లో సుమారు 102.11 చదరపు గజాల రెవెన్యూ స్థలంలో సికింద్రాబాద్‌కు చెందిన కాజా ఛారిటబుల్ ఫౌండేషన్ అధికారుల వద్ద నుంచి ఎటువంటి ముందస్తు అనుమతులు పొందకుండానే భవన నిర్మాణం పనులు చేపట్టింది. ఫౌండేషన్, రెవెన్యూ శాఖల మధ్య ఎటువంటి లిఖిత పూర్వక ఒప్పందాలు కానీ, సంబంధిత ప్రభుత్వ శాఖల నుంచి నిబంధనల ప్రకారం తీసుకోవాల్సిన అనుమతులు లేనట్టు తెలుస్తోంది. పైగా ప్రోటోకాల్ ప్రకారం స్థానిక ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప శంకుస్థాపన చేయకుండా ప్రభుత్వ స్థలంలో భవన నిర్మాణం చేపట్టడంపై పలువురు కూటమి నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నట్టు తెలుస్తోంది. ఇదే ప్రదేశంలో గతంలో మున్సిపల్ అధికారులు ప్రజల సౌకర్యార్థం మొబైల్ పబ్లిక్ లాయిలెట్ ఏర్పాటు చేశారు. ప్రస్తుతం అక్కడ దానిని తొలగించి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. దీంతో వివిధ పనుల మీద పట్టణానికి వచ్చే మహిళలు, ప్రజలు టాయిలెట్లు లేక నానాఅవస్థలు పడుతున్నారు. దీనిపై ఫర్ ది పీపుల్ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ చైర్మన్ గుణ్ణం లక్ష్మణరావు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై రెవెన్యూ అధికారులను వివరణ కోరగా కాజా ఛారిటబుల్ ఫౌండేషన్ భవనాన్ని నిర్మించి రెవెన్యూశాఖకు అప్పగించనున్నట్టు తెలిపారు.



పెద్దాపురంలో చేపట్టిన భవన నిర్మాణం

హెల్త్ క్లీనిక్ నిర్వహణపై తనిఖీలు



గొల్లప్రోలు అర్బన్‌హెల్త్ సెంటర్‌లో తనిఖీలు చేస్తున్న బృందం సభ్యులు

గొల్లప్రోలు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలులోని అర్బన్‌హెల్త్ సెంటర్‌లో హెల్త్ క్లీనిక్ నిర్వహణపై వైద్యఆరోగ్యశాఖకు చెందిన టాస్క్‌ఫోర్స్ జిల్లా బృందం శుక్రవారం తనిఖీలు నిర్వహించింది. గర్భిణులు, బాలింతలు, యువకులు, విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీశారు. రక్తంలో హిమోగ్లోబిన్ శాతం తదితర అంశాలను పరిశీలించి సూచనలు చేశారు. వైద్యఆరోగ్యశాఖ జిల్లా స్టాటికల్ ఆఫీసర్ బీవీ విజయలక్ష్మి, డీపీవో మహేష్, ఎంఐఎస్ సతీష్, వైద్యాధికారి రామ్‌కుమార్ పాల్గొన్నారు.

టీడీపీ గ్రీవెన్స్‌లో వర్మ



వినతులు స్వీకరిస్తున్న మాజీ ఎమ్మెల్యే వర్మ

పిఠాపురం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలోని గ్రీవెన్స్‌సెల్‌లో పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ శుక్రవారం పాల్గొన్నారు. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు ప్రజలు నుంచి వినతులు స్వీకరించి పరిష్కరించే నిమిత్తం అధికారులతో మాట్లాడారు. కాగా చంద్రబాబును వర్మ కలిసి నియోజకవర్గంలో పరిస్థితులపై వివరించారు.

'సమస్యలు పరిష్కరించాలి'

కొత్తపల్లి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను పరిష్కరించాలని సీపీఎం మండల నాయకుల ఆధ్వర్యంలో కార్యకర్తలు శుక్రవారం వాకతిప్ప ఎండీపేట నుంచి ప్రదర్శన చేపట్టారు. గ్రామంలో తాగడానికి కనీసం మంచినీరు లేదని, మురుగునీరు పోయేందుకు దారి లేదని ప్రజలు నాయకులకు వివరించారు. వాకతిప్ప ఎండీపేట సమస్యలపై ఈ నెల 18న స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించే ధర్నాలో ప్రజలు పాల్గొనాలని సీపీఎం నాయకులు, జి.అప్పారెడ్డి కె నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. శివకుమార్, చిన్ని, అంగర సుబ్రహ్మణ్యం, శ్రీను, సీహెచ్ నారాయణరెడ్డి,విసత్యనారాయణ తదితరులున్నారు.

బిర్సాముండా జయంతి

పెద్దాపురం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక జవహర్ నవోదయలో ఆదివాసీల ఆరాధ్య దైవం, భారత స్వాతంత్ర్య సమర యోధుడు బిర్సాముండా జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి విద్యాలయ ప్రిన్సిపాల్ రామకృష్ణయ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆంగ్లేయుల పాలనలో ఆదివాసీలకు జరిగిన అన్యాయాలపై చైతన్య రగిల్చి పోరాటానికి నాయకత్వం వహించి ఆపోరాటంలో చిన్న వయసులోనే మరణించారని, ఆ స్ఫూర్తిని కొన సాగించాలన్నారు. సత్యనారా యణ, పాపారావు, భాస్కరరావు, అప్పారావు, ధనరాజు,నగేష్ పాల్గొన్నారు.

వైభవంగా కార్తీక పౌర్ణమి పూజలు



కాకినాడలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు, గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో జ్వాలా తోరణం

పోర్టుసిటీ (కాకినాడ), నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): నగరంలోని శివాలయాల్లో కార్తీక పౌర్ణమి పూజలను ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దేవాలయంవీధిలో ప్రసిద్ధి గాంచిన పురాతన బాలాత్రిపురసుందరి సమేత భీమేశ్వరస్వామి దేవాలయం(పెద్దశివాలయం)లో శుక్రవారం కార్తీక దీపాలను వెలిగించి పూజలు చేశారు. రామారావుపేట అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి దేవాలయం (చిన్నశివాలయం)లో కార్తీక దీపారాధన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. భానుగుడి శ్రీభానులింగేశ్వరస్వామి దేవాలయంలో కార్తీక పౌర్ణమి దీపోత్సవం నిర్వహించారు. పెద్ద శివాలయంలో జ్వాలాతోరణం వైభవంగా జరిగింది. ఆయా దేవాలయాల కార్య నిర్వహణాధికారులు విప్పర్తి రాజేశ్వరరావు, బాదం శ్రీరామచంద్రమూర్తి,కె.శ్రీనివాస్ ఉన్నారు.

కార్పొరేషన్: కాకినాడ అంబేడ్కర్ బుద్ధ విహార్‌లో కార్తీక పౌర్ణమిని ఘనంగా నిర్వహించారు. ముందుగా దమ్మశాంతి ర్యాలీ బుద్ధ విహార్ నుంచి ఇంద్రపాలెం అంబేద్కర్ శిలా విగ్రహం వరకు చేపట్టారు. విహార్‌లో జరిగిన సమావేశంలో బుద్ధ వంచన పంచశీల ధ్యానం ఆచరణ, డాక్టర్ అంబేడ్కర్ రచన బుద్ధుడు అతని దమ్మ పఠనం చేశారు. బుద్ధ వంశం అంశంపై ఉపాసిక, రిటైర్డు ప్రొఫెసర్ చెల్లి ఉషారాణి బుద్ధ ప్రవచనం చేశారు. కార్యక్రమంలో ఉపాసిక డాక్టర్ భానుమతి, ప్రొఫెసర్ బత్తుల తిరుమల కృష్ణమైత్రీ, అధ్యక్షుడు డాక్టర్ కె.బాబ్జి, కార్యదర్శి డాక్టర్ కె.రామారావు, ట్రజరర్ ఉపాసక, పి.రాంప్రసాద్, డి.వెంకటరావు, ఎస్.సరోజిని ఉన్నారు.

పిఠాపురం: పట్టణంలోని పాదగయ క్షేత్రంతో పాటు అన్ని శివాలయంలో జ్వాలాతోరణం శుక్రవారం రాత్రి వైభవంగా జరిగింది. కొత్తగా వచ్చిన వరిగడ్డిని తోరణాలుగా వేలాడతీసి వాటిని వెలిగించి ఆ జ్వాలల్లో నుంచి ఉత్సవమూర్తులను తీసుకువచ్చారు. ఉత్సవమూర్తులను తీసుకువచ్చేందుకు భక్తులు పోటీపడ్డారు. పాదగయ క్షేత్రంలో రాజరాజేశ్వరీ సమేత ఉమారామలింగేశ్వరస్వామి, గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో అపర్ణా సమేత నాగేశ్వరస్వామి ఉత్సవమూర్తులను అర్చకులు జ్వాలల్లో నుంచి తీసుకువచ్చారు.

కరప: కరపలోని పర్వతవర్ధినీదేవి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రధానార్చకుడు విలపర్తి శ్రీనివాస్, ఫణికుమార్‌లు స్వామి వారికి అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. మహిళలు ఆలయాల్లో దీప, సాలిగ్రామ, ఉసిరి, కొబ్బరిబొండాలు, పువ్వుపిండెలను అర్చకులు దానమిచ్చి ఆశీర్వాదం తీసుకున్నారు. రాత్రికి ఆలయం వెలుపల నిర్వహించిన జ్వాలా తోరణం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.

గొల్లప్రోలు రూరల్: చేబ్రోలులోని పర్వత వర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి, దుర్గాడలోని పంచాయతన సమేత ఉమా రామలింగేశ్వరస్వామికి అభిషేకాలు, కుంకుమార్చనలు, రుద్రాభిషేకాలు జరిగాయి. ఆలయాల్లో దీపాలు వెలిగించారు. దుర్గాడలో రామలింగేశ్వరస్వామికి ఆలయ అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తులు పుష్పాలంకారం చేశారు. ఝటాఝుటదారీగా అలంకారం గావించారు. తాటిపర్తిలో అపర్ణా సమేత నాగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు జరిగాయి. అమ్మవారిని వెండిచీరతో అలంకరించా రు. పంచామృత సుగంధ ద్రవ్యాలతో అభిషేకం సహస్ర కుంకుమర్చాన, విశేష పూజలు నిర్వహించారు. వేదపండితులు ఆకొండి వెంకటేశ్వరశర్మ, ప్రదాన అర్చకుడు ప్రభాకరశాస్త్రిలు పూజలు నిర్వహించగా, ఆలయ కమిటీ ఏర్పాట్లు చేసింది.

తాళ్లరేవు: కోరింగ పంచాయతీ చినబొడ్డువెంకటాయపాలెంలో శ్రీమహాలక్ష్మతల్లికి శ్రీగణేష్ యూత్ ఆధ్వర్యంలో అర్చకుడు పినపోతు గంగరాజు సమక్షంలో 9రకాల పంచామృతాలతో అమ్మవారికి అభిషేకాలు చేశారు. పురోహితులు పెండ్యాల వెంకటేశ్వర్లు అమ్మవారికి గ్రామస్తులతో లక్ష కుంకుమార్చన పూజలు చేయించారు.

గొల్లప్రోలు: పట్టణంలోని శివాలయానికి తెల్లవారుజామునే భక్తులు వచ్చి ఉమారామలింగేశ్వరస్వామిని దర్శించుకున్నారు. రోజంతా ఉపవాసం ఉన్న భక్తులు సాయంత్రం ఆలయానికి వచ్చి కార్తీక దీపాలు వెలిగించారు. విష్ణాలయం, వెంకటేశ్వరస్వామి, భక్త మార్కండేయ స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి.

కొత్తపల్లి: కొత్తపల్లిలో శ్రీ బాలత్రిపురసుందరీ సమేత రాజశేఖరస్వామి ఆలయం, ఉప్పాడలో శ్రీచౌడేశ్వరి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయం, కొమరగిరిలో శ్రీఅన్నపూర్ణసమేత విశ్వేశ్వర స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

పవన్ ఆదేశాలతో సమస్యలకు పరిష్కారం

పిఠాపురం ప్రజల్లో ఆనందం



పిఠాపురంలో యానాదుల కాలనీ కల్వర్టు వద్ద నిర్మించిన రక్షణ గోడలు

పిఠాపురం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రత్యక్షంగా వచ్చారు. పరిస్థితులు చూశారు. అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. 11రోజుల్లో సమస్య పరిష్కారమైంది. తమ కష్టాలను స్వయంగా చూసి ఏళ్ల తరబడి తాము ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం చూపిన డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు అక్కడి ప్రజలు కృతజ్ఞతలు తెలియజేశారు. పిఠాపురంలో ఈనెల 4న పవన్ పర్యటించారు. స్థానికుల వినతులపై క్షేత్రస్థాయిలోకి వెళ్లారు. విరవాడ రోడ్డులోని యానాదుల కాలనీ వద్ద గల కల్వర్టుకు రక్షణ గోడ లేక ప్రమాదాలకు గురవుతున్న విషయాన్ని పవన్ దృష్టికి తీసుకువచ్చారు. పవన్ ఆదేశాలతో అధికారులు కదిలారు. యుద్ధప్రాతిపదికన కల్వర్టుకు ఇరువైపులా రక్షణ గోడను నిర్మించారు. చకచకా పనులు జరగడంతో అక్కడ ప్రజల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. అదే రోజు రథాలపేటలో విస్తృతంగా పర్యటించారు. కుళాయిలు ద్వారా సక్రమంగా తాగునీరు రాక తాము పడుతున్న ఇబ్బందులుపై మహిళలు ఆయనకు వివరించారు. కుళాయి ద్వారా సన్నని ధారగా నీరు రావడాన్ని చూసిన ఆయన ఆశ్చర్యపోయారు. తక్షణం సమస్యను పరిష్కరించమని ఆదేశాలు ఇచ్చారు. మున్సిపల్ అధికారులు అక్కడ పైపులైను మార్చడంతో నీటి సరఫరా మెరుగుపడింది. కుళాయిల ద్వారా తాగునీరు వేగంగా వస్తున్నదని ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు.

భక్తుల కోసం మొబైల్ టాయిలెట్లు

పిఠాపురం పాదగయ క్షేత్రంలో భక్తుల కోసం డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ మొబైల్ టాయిలెట్లు పంపించారు. ఇటీవల పిఠాపురంలో పవన్ పర్యటించిన సమయంలో పాదగయ క్షేత్రానికి వచ్చే భక్తులకు టాయిలెట్లు లేక ఇబ్బందులు పడుతున్న విషయం ఆయన దృష్టికి వచ్చింది. దీనిపై స్పందించిన పవన్ తన సొంత స్వచ్ఛంద సేవాసంస్థ అయిన పీకే ట్రస్టు ద్వారా 20 మొబైల్ టాయిలెట్లు కొనుగోలు చేశారు. వాటిని పాదగయ పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేసే నిమిత్తం పిఠాపురం పంపారు. వీటిని అక్కడ ఏర్పాటు చేసి నీటి వసతిని కల్పించారు. పవన్ చొరవ పట్ల భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



పాదగయ క్షేత్రంలో మొబైల్ టాయిలెట్లు

నూతన విద్యావిధానాన్ని వ్యతిరేకించాలి



సభలో పాల్గొన్న నాయకులు

కాకినాడ సిటీ, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): నూతన జాతీయ విద్యా విధానాన్ని ప్రతిఒక్కరూ వ్యతిరేకించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పి.జాన్సన్‌బాబు పిలుపునిచ్చారు. సూర్యకళామందిరంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రథమ మహాసభ డి.శ్రీను అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ముఖ్య అతిథిగా జాన్సన్‌బాబు మాట్లాడారు. బ్యాంకు ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకుడు కె.ఆదినారాయణ, ఏఐఎస్ఎఫ్ జిల్లా మాజీ కార్యదర్శి తాటిపాక మధు, సీపీఐ జిల్లా కార్యదర్శి కె.బోడకొండ, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి తోకల ప్రసాద్, నాయకులు చింతలపూడి సునీల్, ప్రసాద్ ప్రసంగించారు. అనంతరం ఏఐఎస్ఎఫ్ జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా జి.ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా డి.శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా ఎ.నాగలక్ష్మి, రమేష్, సహాయ కార్యదర్శులుగా తంగెళ్ల అక్షయ్, దీప్తి, కోశాధికారిగా శ్రీరామ్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

'అమరవీరుల త్యాగాలను స్మరించుకోవాలి'

పెద్దాపురం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): అమరవీరుల త్యాగాలను స్మరించుకోవాలని రైతుకూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు అన్నారు. పట్టణ పరిధిలోని దమ్ముపేటలో కామ్రేడ్ చంద్ర పుల్లారెడ్డి 40వ వర్ధంతి సందర్భంగా నిర్వహించిన సంస్మరణ సభ కార్యక్రమంలో ఆయన శుక్రవారం మాట్లాడారు. భూమి, భుక్తి కోసం విముక్తి కోసం విప్లవ ఉద్యమంలో అసువులు బాసిన అమరవీరుల త్యాగాలను స్మరించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతరం పట్టణంలో ప్రదర్శన నిర్వహించారు. కుంచే అంజిబాబు, వల్లూరి రాజబాబు, సురేష్, నాగేశ్వరరావు, వెంకటలక్ష్మీ, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

'గ్రంథ పఠనాన్ని అలవర్చుకోవాలి'

కాకినాడ రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరూ గ్రంథ పఠనాన్ని అలవర్చుకోవాలని ఐడియల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజనీరింగ్ కళాశాల పాలక మండలి సభ్యులు జీవీకృష్ణంరాజు అన్నారు. కళాశాలలో గ్రంథాలయ పరిపాలనా అధికారి కె.సాయి బాబు అధ్యక్షతన శుక్రవారం గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహించారు. జీవీకృష్ణంరాజు ముఖ్యఅతిథిగా, ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శ్రీకాంత్, ఏవో జీవీకె వర్మ విశిష్ట అతిథులుగా పాల్గొన్నారు. విద్యార్థులకు నిర్వహించిన పలు పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణమూర్తి, శ్రీహరివర్మ, ప్రసాద్, అంజిబాబు తదితరులున్నారు.

కాకినాడలో పుస్తక ప్రదర్శన

కాకినాడ సిటీ, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా రెండోరోజు శుక్రవారం కాకినాడలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వివిధ రకాల పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ వైడీ రామారావు ప్రారంభించారు. అనంతరం సభలో మాట్లాడుతూ మనిషిని ఉన్నతుడిగా తీర్చిదిద్ది సంస్కారవంతుడిగా చేసే శక్తి ఒక గ్రంథాలయాలకే ఉందన్నారు. గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వీ.వరప్రసాద్, ఇన్‌చార్జి ఉపగ్రంథాలయాధికారి కె.కిషోర్ పాల్గొన్నారు.

'అపార్ ఐడీ నమోదు వేగవంతం చేయాలి'

కార్పొరేషన్(కాకినాడ), నవంబరు 15(ఆంధ్రజ్యోతి): అపార్ ఐడీ నమోదు వేగవంతంగా పూర్తిచేసేలా ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల, కళాశాలల ప్రిన్సిపాల్స్‌ను అప్రమత్తం చేయాలని కమిషనర్ భావన ఆదేశించారు. ఈ మేరకు నగరపాలక సంస్థలోని అన్ని విభాగాల అధికారులు, నోడల్ ఆఫీసర్లతో కమిషనర్ శుక్రవారం సమావేశమయ్యారు. ప్రతీ విద్యార్థి అపార్ ఐడీ వివరాలను యూడైస్ ప్లస్‌లో నిక్షిప్తం చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన యూడైస్ ప్లస్ విధానంలోకి విద్యార్థుల వివరాలు నమోదు చేయాలని ఆదేశించారు. విద్యార్థులకు తప్పనిసరిగా అపార్ ఐడీ ఉండాలన్నారు. ఆధార్‌లో తప్పుఒప్పులుంటే సరిచేసుకుని అపార్ ఐడీను నమోదు చే యించుకోవాలని సూచించారు. సమావేశంలో అదనపు కమిషనర్ కెటి సుధాకర్, డిప్యూటీ కమిషనర్ కె.మనోహర్, కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, ఎంహెచ్‌వో పృథ్వీచరణ్, టీపీఆర్వో శైలజ ఉన్నారు.

'జ్ఞానాన్ని సౌభ్రాతృత్వం కోసం వినియోగించాలి'

పిఠాపురం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మానవునికి మేధాశక్తి ద్వారా జ్ఞానాన్ని పొందే అవకాశాన్ని భగవంతుడు కల్పించాడని, దానిని మానవ సౌభ్రాతృత్వం కోసం వినియోగించాలని విశ్వవిజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠాధిపతి డాక్టర్ ఉమర్‌ఆలీషా తెలిపారు. కార్తీకపౌర్ణమి సందర్భంగా పిఠాపురం పట్టణ శివారులోని పీఠం నూతన ఆశ్రమ ప్రాంగణంలో శుక్రవారం జరిగిన ఆధ్యాత్మిక సభలో ఆయన భక్తులనుద్దేశించి మాట్లాడారు. అనంతరం ఉమర్‌ఆలీషా రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు ద్వారా కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. భక్తులకు పరికుచ్చులు అందజేశారు. కార్యక్రమంలో పీఠం కన్వీనర్ పేరూరి సూరిబాబు, ఆకుల రవితేజ, ఏవీవీ సత్యనారాయణ, ఎన్‌టీవీ ప్రసాదవర్మ తదితరులు పాల్గొన్నారు.

మహిళా రక్షక్ బృందాల గస్తీ

కాకినాడ క్రైం నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మహిళలు, బాలికల రక్షణే లక్ష్యంగా ఎస్పీ విక్రాంత్ పాటిల్ మహిళా రక్షక్ పోలీసులను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఆ మహిళా బృందాల గస్తీతో జిల్లాలో పాఠశాలలు, కళాశాలల వద్ద ఈవ్‌టీజింగ్‌కు పాల్పడే ఆకతాయిలు పరారవుతున్నారు. అనతి కాలంలోనే ఈ మార్పు పట్ల మహిళలు విద్యార్థినులు ఎస్పీకి కృతజ్ఞతలు తెలుపుతున్నారు. ముఖ్యంగా డయల్ 112, 102, 9494933233 వాట్సాప్ నెంబర్ల విస్తృత ప్రచారం, వినియోగం ద్వారా పోలీస్ సేవలను పొందే విధానాన్ని మహిళా రక్షక్‌కులు విద్యార్థినులకు, మహిళలకు అవగాహన కల్పిస్తున్నారు. గతంలో మహిళలు, బాలికలపై జరిగిన దాడులను ఉదహరిస్తు జిల్లాలో గుర్తించిన 89 ప్రాంతాల్లో గస్తీ నిర్వహిస్తూ క్రమ శిక్షణ, స్వీయ పరిరక్షణ అంశాల్లో మహిళా రక్షక్‌లు అవగాహన కల్పిస్తున్నారు.

Anand CINEMAS (4 SCREENS) Experience it in 4K Dolby Atmos
BHANUGUDI JUNCTION KAKINADA
DEVI CINEMAS (4 SCREENS) Experience it in 4K Dolby Atmos
CINEMA ROAD KAKINADA
BOOK ONLINE TICKETS Paytm
NOW SHOWING



GLADIATOR II - TEL
11-15AM, 2-15PM, 6-20PM, 9-20PM
MATKA (U/A) (TEL)
2-30PM, 10-00PM
AMARAN :
11-20AM, 2-40PM, 6-45PM, 9-40PM
KANGUVA (U/A) 3D (TEL)
11-30AM, 2-45PM, 6-30PM, 9-45PM

KANGUVA (U/A) (3D) (TEL)
11-15AM, 2-30PM, 6-30PM, 9-45PM
MATKA (TEL) (U/A)
11-30AM, 2-45PM, 6-20PM, 9-30PM
KA 2024 (TEL) : 11-40AM, 6-40PM
AMARAN (TEL)
11-20AM, 2-40PM, 6-45PM, 9-40PM

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
జిల్లాస్థాయి ఇసుక కమిటీ, కాకినాడ జిల్లా

తూర్పుగోదావరి జిల్లాలోని ఇసుక రీచ్‌ల నుండి ఇసుకను కాకినాడ జిల్లాలోని ఈ క్రింది నిల్వ కేంద్రముల వద్దకు రవాణా మరియు నిల్వచేసి, నిల్వ కేంద్రం నుండి వాహనాలలో లోడ్ చేయుట కొరకు లాటరి పద్ధతిన ఏజెన్సీని నియమించుటకు

ప్రకటన

నోటిఫికేషన్. సంఖ్య: 1904/SAND/2024 తేది: 15.11.2024

ఇందుమూలముగా ప్రకటించునది ఏమనగా, దిగువ షెడ్యూల్‌లో పేర్కొనబడిన ఇసుక రీచ్‌ల నుండి ఇసుకను కాకినాడ జిల్లాలోని ఈ క్రింది నిల్వ కేంద్రముల వద్దకు రవాణా మరియు నిల్వచేసి, నిల్వ కేంద్రం నుండి రవాణా వాహనాలలో లోడ్ చేయుట కొరకు లాటరి పద్ధతిన ఏజెన్సీని నియమించుటకు ధరఖాస్తులు ఆహ్వానించబడుచున్నవి. దరఖాస్తులు జిల్లా గనులు మరియు భూగర్భశాఖ అధికారి వారి కార్యాలయం, కాకినాడలో ది.16.11.2024 నుండి 20.11.2024 తేదీన సాయంత్రం 05.00 PM వరకు స్వీకరించబడును.

క్రమ సంఖ్య	ఇసుకరీచ్ పేరు	పరిమాణం మెట్రిక్ టన్నుల్లో	ఇసుక నిల్వ కేంద్రము	నిల్వకేంద్రం వద్ద నిర్ధారించిన అమ్మకపు రేటు ఒక టన్నుకి (రూ.లలో)
1	వేమగిరి–కడియపులంక	68550	గొల్లప్రోలు	582/-
2	తీపర్రు–3	67950	పెద్దాపురం	600/-
			కాకినాడ	600/-

గమనిక: లాటరి నియమ నిబంధనలు, దరఖాస్తు నమూనాలు మొదలగు మరియు అనుబంధములను జిల్లా గనులు మరియు భూగర్భశాఖ అధికారి వారి కార్యాలయం, కాకినాడ నుంచి దరఖాస్తు, ఒక నిల్వ కేంద్రం కి రూ.5000/- చొప్పున Collector and District Magistrate, kakinada and District Mines and Geology Officer, kakinada వారి పేరిట డిమాండ్ డ్రాఫ్ట్ చెల్లించి 20.11.2024 తేదీన మధ్యాహ్నం 1.00 గంటలోపు పొందవచ్చును.

జిల్లా కలెక్టర్ & ఛైర్మన్,
జిల్లా స్థాయి ఇసుక కమిటీ, కాకినాడ జిల్లా

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

బిల్లులు విడుదల చేయాలని ఆందోళన

ప్రత్తిపాడు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన పథకం బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం మండలంలోని మధ్యాహ్న భోజన పథక కార్మికులు ఎంఈవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి ఎంఈవో వి.రాజబాబుకు వినతిపత్రం అందజేశారు. ఆందోళనకు సీపీఎం మండల కార్యదర్శి రొంగల ఈశ్వరరావు మద్దతు తెలిపారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

కార్తీక పౌర్ణమి పూజలు



రంప శివాలయంలో పూజలు చేస్తున్న అర్చకులు

రంపచోడవరం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం మండలంలోని పలు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. రంపలోని 12వ శతాబ్దం నాటి శ్రీభ్రమరాంబికా సమేత మల్లికార్జున స్వామి ఆలయంలో అర్చకులు గొడవర్తి ప్రసన్నకుమార్ శర్మ లక్ష దీపోత్సవ పూజలు జరిపించారు. ఐ.పోలవరం గోవింద గిరి వెంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారికి అభిషేకం, కార్తీక దీపోత్సవం అర్చకులు పార్ధ శ్రీనివాస్‌స్వామి, గోవర్ధనం మణికంఠచార్యులు, వేదపండితులు సాయిరాం శర్మ ఘనపాఠి, అధికారులు జరిపించారు. సంత మార్కెట్ వీధిలో కొలువైన శ్రీఉమా రామలింగేశ్వర స్వామి ఆలయంలో విశేష పూజలు, దీపోత్సవం, జ్వాలతోరణం కార్యక్రమాలు అర్చకులు లింగాల సీతారామాంజేయ ప్రసన్నకుమార్ శర్మ జరిపించారు. ధర్మ ప్రచార భక్త మండలి సమన్వయ కర్త నల్లమిల్లి వెంకట రామారెడ్డి, విశ్వహిందూ పరిషత్ పాల్గొన్నారు.

ఐదు వేల ప్రమిదలతో దీపారాధన



దీపాలు వెలిగిస్తున్న భక్తులు

చింతూరు, నవంబరు15(ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి వైభవంగా జరిగింది. అందుకు ప్రజాహిత బ్రహ్మకుమారీస్ వేదికగా మారింది. శుక్రవారం రాత్రి ఐదువేల ప్రమిదలతో దీపారాధన చేశారు. భక్తజనం అత్యంత భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. చింతూరు (ఎర్రంపేట)లో ఐదు రోజులుగా బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో గీతా పాఠశాల వద్ద భక్తి కార్యక్రమాలు నిర్వహించారు. భగవద్గీత పారాయణం, జ్యోతిర్లింగార్చన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అయ్యప్ప మాలధారులకు అల్పాహారం సమకూర్చారు. రాజమహేంద్రవరానికి చెందిన బ్రహ్మకుమారి రాజయోగిని భవాని విద్యార్థులు, పెద్దలకు భగవద్గీత పారాయణం విన్పించారు. చివరిగా రేల నృత్యంతో ఐదు రోజుల వేడుకను ముగించారు. కాకినాడ, రంపచోడవరం, అమలాపురం, భద్రాచలం, హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి బ్రహ్మకుమారీస్‌లు పాల్గొనగా స్థానిక ఏరియాఆసుపత్రి వైద్యురాలు డ్దార్ శశికళ నేతృత్వం వహించారు. వివిధ ప్రాంతాలకు చెందిన ప్రముఖులకు బ్రహ్మకుమారీస్ తరఫున బహుమతులు అందజేశారు.

భక్తులతో కిటకిటలాడిన దేవాలయాలు

వరరామచంద్రాపురం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి సందర్భంగా దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తులు తెల్లవారు జాము నుంచే పవిత్ర గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించి, వడ్డిగూడెంలోని శ్రీరుద్రకోటేశ్వర స్వామివారి ఆలయంలో అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నాగదేవతకు పూజలు నిర్వహించారు. పుట్టలో పాలు పోసి చల్లగా చూడమ్మా అంటూ నాగదేవతకు పండ్లు, ఫలహారాలు నైవేద్యంగా సమర్పించి పూజలు నిర్వహించారు.

కార్తీక పౌర్ణమి పూజలు



వై.రామవరం, నవంబరు15(ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి పురస్కరించుకుని మండలంలో పలు చోట్ల పౌర్ణమి వేడుకలు ఘనంగా జరిపారు. గురమంద విశ్వనాథస్వామి ఆలయంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని దీపాలు వెలిగించి పూజలు జరిపారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

దేవీపట్నం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఫజుల్లాబాద్, కమలంపాలెం ఆర్‌అండ్‌ఆర్ కాలనీల్లో ఆలయాలు కిటకిటకిటలాడాయి. వేకువజాము నుంచే ఆయా గ్రామాల సమీపంలోని వాగుల వద్ద పుణ్యస్నానాలాచరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

దుర్గమ్మ ఆలయంలోకి గోమాత



కూనవరం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి సందర్భంగా దుర్గమ్మ ఆలయం భక్తులతో కిటకిటలాడింది. భక్తులు గోదావరి స్నానాలాచరించి కూనవరంలోని కనకదుర్గ ఆలయంలో పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. గోమాత కనకదుర్గ ఆలయంలోకి ప్రవేశించింది. అమ్మవారి గుడి మెట్లు ఎక్కి అమ్మవారి విగ్రహం వైపు దీక్షగా చూస్తు నిలబడిపోయింది. దీంతో భక్తులు ఆలయం నుంచి బయటకు వచ్చేశారు. సుమారు 20నిమిషాలు గోమాత ఆలయం వద్దే ఉండిపోయింది. అమ్మవారి రూపంలో గోమాత ఇక్కడికి వచ్చిందంటూ భక్తులు విశ్వసిస్తున్నారు.

హైడల్ సివిల్ సీఈ కోటేశ్వరరావు పర్యటన



డొంకరాయి పవర్ ప్లాంట్ సందర్శించిన హైడల్ సివిల్ సీఈ కోటేశ్వరరావు

మోతుగూడెం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): వై.రామవరం మండలం బొడ్డగండి పంచాయతీలోని డొంకరాయి పవర్ ప్లాంట్, రిజర్వాయర్‌ను శుక్రవారం ఏపీ జెన్కో విజయవాడ విద్యుత్ సౌధ్ హైడల్ సివిల్ సీఈ కోటేశ్వరరావు సందర్శించారు. అక్కడి సమస్యల గురించి సివిల్ సూపరింటెంటెంట్ ఇంజనీర్ చంద్రశేఖర్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం లోయర్ సీలేరుకు వెళ్లి అక్కడ జరుగుతున్న ఆరు యూనిట్ల సివిల్ పనులు గురించి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వరప్రసాద్‌ని అడిగి తెలుసుకున్నారు. డొంకరాయి, మోతుగూడెం సివిల్ ఉద్యోగస్తులు పాల్గొన్నారు.

శిశు మరణాలపై సమీక్ష



చిన్న పిల్లల ఆరోగ్యంపై తల్లులను అడిగి తెలుసుకుంటున్న రాష్ట్ర శిశు ఆరోగ్య సంచాలకులు డాక్టర్ అర్జునరావు

మోతుగూడెం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మోతుగూడెం ఎస్టీ కాలనీలో శుక్రవారం రాష్ట్ర శిశు ఆరోగ్య సంచాలకుడు డాక్టర్ అర్జునరావు పర్యటించారు. గ్రామాల్లో శిశు మరణాలపై సమీక్ష నిర్వహించారు. ఆయన క్షేత్రస్థాయి పర్యవేక్షణ చేస్తూ వివిధ కుటుంబాలను నేరుగా కలుసుకుని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. హోమ్ బేస్డ్ న్యూబార్న్ కేర్, హోమ్ బేస్డ్ యంగ్ చైల్డ్ కేర్ సందర్శనల నివేదికను పరిశీలించారు. ఆయా కార్యక్రమాలు పకడ్బందీగా అమలవుతున్నాయా లేదా తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహార పంపిణీ ప్రాముఖ్యతను వివరించారు. డాక్టర్ అర్జునరావు మాట్లాడుతూ శిశువులకు సకాలంలో పోషకాహారం, టీకాలు అందించడం ద్వారా మరణాలు తగ్గించవచ్చని, పిల్లలకు ఆరోగ్య సమస్యలువస్తే ఆరోగ్య కార్యకర్తలను సంప్రదించాలని ప్రజలకు సూచించారు. ఆయన వెంట ఉప జిల్లా విద్యాధికారిని డాక్టర్ పి.పుల్లయ్య, జిల్లా టాస్క్ ఫోర్స్ బృందం, వైద్యులు డాక్టర్ ప్రజ్ఞ, డాక్టర్ నఫియా, పర్యవేక్షకులు, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

చింతూరును సుందరంగా తీర్చిదిద్దాలి



దుకాణ యజమానులకు సూచనలిస్తున్న ఐటీడీఏ పీవో అపూర్వభరత్

చింతూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): చింతూరును సుందరీకరణగా తీర్చిదిద్దాలని ఐటీడీఏ పీవో అపూర్వభరత్ పేర్కొన్నారు. శుక్రవారం పీవో దుకాణదారులతో సమావేశమయ్యారు. ఈమేరకు పీవో వారికి పలు సూచనలిచ్చారు. దుఖాణదారులు శ్రమదానం చేయాలని, ఎక్కడా చెత్త కన్పించకుండా పరిసరాలను శుభ్రంగా ఉంచాలన్నారు. కస్తూర్బా పాఠశాల, జూనియర్ కళాశాల ప్రాంగణంలో పీవో మొక్కలు నాటారు. పీవో మాట్లాడుతూ ప్రతి ఆశ్రమ పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటాలన్నారు. అనంతరం ఇంటర్ ద్వితీయ సంవత్సర విద్యార్థులతో పీవో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా విద్యార్థులకు సివిక్స్ సబ్జెక్టును పీవో బోధించారు. చివరిగా విద్యార్థుల ఆసక్తిని అడిగి తెలుసుకున్నారు.

వైభవంగా రామలింగేశ్వరుని తెప్పోత్సవం





తొండంగిలో తెప్పోత్సవ దృశ్యం, మూలగపూడిలో శ్రీకోదండరామస్వామి తెప్పోత్సవం

తొండంగి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): తొండంగిలో కొలువైన రాజరాజేశ్వరి సహిత రామలింగేశ్వరుని తెప్పోత్సవం శుక్రవారం రాత్రి ఆలయ కోనేరులో అంగరంగ వైభవంగా జరిగింది. కార్తీక పౌర్ణమి సందర్భంగా స్వామి, అమ్మవార్లకు ప్రధాన ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. ఉత్సవ మూర్తులకు నూతన వస్త్రాలు ధరింపచేసి విశేష అలంకారంతో పూజలు నిర్వహించారు. భాజాభజంత్రీలు, వేదమంత్రాల నడుమ స్వామిఅమ్మవార్లను విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించిన తెప్పపై ప్రతిష్ఠించారు. పండు వెన్నెలలో స్వామి,అమ్మవార్లు ముమ్మారు కోనేరులో విహరించి భక్తులను అనుగ్రహించారు. ఆలయ ప్రధానార్చకులు పణి శర్మ ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామిని దర్శించుకున్నారు.

మూలగపూడిలో...

రౌతులపూడి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మండంలోని మూలగపూడి గ్రామంలో శ్రీరామగిరి శ్రీకోదండరామస్వామి తెప్పోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. వేద మాంత్రోచ్ఛరణ నడుమ వేములమ్మ సరోవరంలో ఈ కార్యక్రమం చేపట్టారు. లక్ష ఒత్తులతో అఖండ జ్యోతిని వెలిగించారు. కార్తీక పౌర్ణమి కావడంతో భక్తులు ఉదయం నుంచి ఉపవాసం ఉండి సాయంత్రం పూజలు నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు హాజరై తెప్పోత్సవం వీక్షించారు.

'లోవ'లో రాజగోపురం నిర్మాణానికి విరాళం



పూజల్లో విరాళం ఇచ్చిన దాత కుటుంబం

తుని రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): లోవ క్షేత్రంలో ఆలయ పునః నిర్మాణ పనుల్లో భాగంగా రాజగోపురం నిర్మాణానికి కర్నూలు జిల్లాకు చెందిన కోడుమూరు గ్రామస్తులు కేత కుమార్‌గౌడ్ దంపతులు రూ.100011 విరాళాన్ని దేవస్థానం ఉప కమిషనర్, ఈవో పి.విశ్వనాథరాజుకు అందజేశారు. వారికి ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనం గావించి అమ్మవారిశేష వస్త్రాలతో సత్కరించారు.

'రైతులు, మత్స్యకారుల సమస్యలు పరిష్కరించాలి'

తొండంగి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): అరబిందో లైఫియస్ ఫార్మాకంపెనీ కారణంగా ఇబ్బంది పడుతున్న రైతులు, మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని టీడీపీ సీనియర్ నేత యనమల రాజేష్ కలెక్టర్ షాన్ మోహన్‌కు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఆయన తుని ఎమ్మెల్యే యనమల దివ్య ఆదేశాల మేరకు కలెక్టర్‌ను కలిసి రైతుల డిమాండ్లు వివరించారు. రైతుల నుంచి భూములు సేకరించినపుడు వారందరికి ఫ్యాక్టరీలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చి దానిని యాజమాన్యం అమలు చేయడం లేదన్నారు. గతంలో ఇచ్చిన హామీలను మరచి స్థానికేతరులకు ఉద్యోగాలు కల్పించడం రైతుల ఆగ్రహానికి కారణమన్నారు. వాయు,నీటి కాలుష్యానికి సమీప గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని దాని నియంత్రణకు చర్యలు తీసుకోవాలన్నారు. వ్యర్థ జలాలు స్థానికంగా ఉన్న తలపంటిపేట రేవు వద్ద విడుదల చేయడం వల్ల మత్స్యకారులు, హేచరీలకు నష్టం కలుగుతోందన్నారు. డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టర్‌కు అందించారు. చొక్కా అప్పారావు, కాలిబోయిన చంద్రరావు, మనిమెల కొండబాబు తదితరులున్నారు.

ముఖ్యమంత్రికి ఎమ్మెల్యే నెహ్రూ కృతజ్ఞతలు



చంద్రబాబుకు చిత్రపటం అందజేస్తున్న నెహ్రూ

జగ్గంపేట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): టీటీడీ బోర్డు మెంబర్‌గా అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ కృతజ్ఞతలు తెలియజేసి సత్కరించారు. రాష్ట్ర సచివాలయంలో శుక్రవారం చంద్రబాబుతో తనకున్న అనుబంధాన్ని వివరిస్తూ చిత్రపటం బహూకరించారు. శ్రీవారి ప్రసాదం అందించారు.

అసెంబ్లీలో ప్రసంగం

అసెంబ్లీలో జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ శుక్రవారం పలు అంశాలపై ప్రసంగించారు. జగ్గంపేట నియోజకవర్గంలో మల్లవరం లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా సుమారుగా 10వేల ఎకరాలకు నీరందించడానికి రూ.130 కోట్ల నిధులను మంజూరవ్వగా వైసీపీ ప్రభుత్వం దాన్ని పూర్తిగా దొంగలతో చేయడం జరిగిందని, అందువల్ల ఈ ప్రాజెక్టు పనులు కూడా పూర్తి చేయడానికి ముఖ్యమంత్రి చొరవ చూపాలని ఆయన కోరారు.

గిరిజనులకు ఐటీడీఏ ఏర్పాటు చేయాలి

ఎమ్మెల్యే సత్యప్రభ



అసెంబ్లీలో ప్రసంగిస్తున్న సత్యప్రభ

ప్రత్తిపాడు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు నియోజకవర్గంలోని సబ్‌ప్లాన్ ఏజెన్సీ గిరిజనులకు ఐటీడీఏ ఏర్పాటు చేయాలని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా శుక్రవారం అసెంబ్లీ దృష్టికి తీసుకెళ్లారు. నియోజకవర్గంలోని 54 సబ్‌ప్లాన్ గిరిజన గ్రామాలు రంపచోడవరం ఐటీడీఏ పరిధిలో ఉండేవని, జిల్లాలు విడిపోవడం వల్ల కాకినాడ జిల్లాలోని ప్రత్తిపాడు నియోజకవర్గంలో గిరిజనులకు ఐటీడీఏ సౌకర్యాలు, పథకాలు అందక ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే వివరించారు. అలాగే ఏలేశ్వరం- జె.అన్నవరం వెళ్లే రహదారి చాలా అధ్వానంగా మారిందని గత వైసీపీ ప్రభుత్వం రహదారి అభివృద్ధికి పట్టెడు మట్టి కూడా వేయలేదన్నారు. నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరారు.

'ఆదిత్య'లో జాతీయ సదస్సు



సదస్సును ప్రారంభిస్తున్న అతిథులు

గండేపల్లి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని సూరంపాలెంలో ఆదిత్య ఫార్మసీ కళాశాలల ఆధ్వర్యంలో కంప్యూటేషనల్ అడ్వాన్స్‌మెంట్ ఇన్ రీసెర్చ్ అండ్ ఎడ్యుకేషన్ ఫర్ ఫార్మాస్యూటికల్ ఎక్సలెన్స్(కేర్ 2024) జాతీయ సదస్సు మొదటి రోజు ఘనంగా ప్రారంభించారు. ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ డాక్టర్ మొంటు ఎం.పటేల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సీనియర్ ప్రిన్సిపాల్ సైంటిస్టు, సెంట్రల్ డ్రగ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ డాక్టర్ అనిల్ నీల్ కాంత్ గైక్వాడ్, మదర్‌థెరెస్సా ఇనిస్టిట్యూట్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.కవిమణి హాజరై కాన్ఫరెన్స్ ప్రాముఖ్యత, ఏఐ ఆవిష్కరణలు కనుగొనడం, వాటిని అభివృద్ధి చేయడం, కొత్త పద్ధతులపై వివరించారు. ఆదిత్య డిప్యూటీ ప్రో చాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రవిశంకర్, డాక్టర్ డి.సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా బిర్సా ముండా జయంతి





రంపచోడవరం: మాట్లాడుతున్న ఏఐకేఎంఎస్ రాష్ట్ర కార్యదర్శి కుంజా దూలయ్య, చింతూరు: మాట్లాడుతున్న ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు బంగారు వెంకటేశ్వర్లు

రంపచోడవరం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ఆదివాసీ తొలి స్వాతంత్ర్య పోరాట యోధుడు బీర్సా ముండా 150వ జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక మార్క్స్, ఎంగిల్స్ భవనంలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ, ఏఐకేఎంఎస్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో బీర్సా ముండా చిత్రపటానికి నివాళులర్పించారు. ఏఐకేఎంఎస్ రాష్ట్ర కార్యదర్శి కుంజా దూలయ్య మాట్లాడుతూ బీర్సా ముండాను ఆదర్శంగా తీసుకుని ఆదివాసీలను నిర్మూలించే ఆపరేషన్ కగార్‌ను కేంద్ర ప్రభుత్వం నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఆదివాసీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. జీవోనెం.3కి సాధికారత కల్పిస్తూ,ఆదివా సీలు, దళితులకు వర్గీకరణ చేయాలన్నారు. విద్యుత్ చార్జీలను తగ్గించాలని, ఆదివాసీ ప్రజలకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరతూ ఈనెల19న కమ్యూనిస్టుల ఆధ్వర్యంలో చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని నిర్వ హిస్తామని హెచ్చరించారు. అనంతరం కేంద్ర రాష్ట్ర ప్రభు త్వాలు అవలంభిస్తున్న ఆదివాసీ ప్రజా వ్యతిరేక విధానాలపై నినాదాలు చేస్తూ గ్రామ పురవీధుల్లో భారీ ర్యాలీ చేశారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు ఇల్లా బాలురెడ్డి, పి.అనసూయ, పల్లాల లచ్చిరెడ్డి, కత్తుల బాలురెడ్డి, ఐ.వి.రమణ, కారం బాపనమ్మ, బచ్చెల మంగిరెడ్డి, డి.నాగరాజు, పి.లక్ష్మణ్‌రెడ్డి, కత్తుల సుగ్గిరెడ్డి, ఐ.కిరణ్‌కుమార్ రెడ్డి, మడి ప్రసాద్‌దొర, కారం లచ్చన్నదొర పాల్గొన్నారు.

రూ.10వేలు గౌరవ వేతనం చెల్లించాలి

చింతూరు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రకృతి ఆరాధికులైన ఆదివాసీలకు నెలకు రూ.10వేలు వంతున గౌరవ వేతనం చెల్లించాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. శుక్రవారం తులసిపాకలలో బీర్సాముండా 150వ జయంతి కార్యక్రమాన్ని ఆదివాసీలు ఘనంగా జరుపుకున్నారు. ఆదివాసీ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా ప్రత్యేక చట్టం రూపొందించాలని ఆయన కోరారు. తాటి చెట్ల నుంచి కల్లు సేకరించే ఆదివాసీలకు బీమా సౌకర్యం, రక్షణ కిట్లు కల్పించాలన్నారు. ఆదివాసీ గ్రామాల్లో సాగునీటి పారుదలకు ఎత్తిపోతల పథకాలు ప్రవేశపెట్టాలన్నారు. మన్యంలో స్థానిక ఆదివాసీలకు నూటికి నూరు శాతం ఉద్యోగ, ఉపాధి కల్పించాలన్నారు. రాష్ట్రంలోని ఎనిమిది ఐటీడీఏల పరిదిధిలో ఆదివాసీ సంప్రదాయ పూజార్లు, వేపార్లను ఏర్పాటుచేసి వారందరికి గౌరవ వేతనం చెల్లిస్తూ ఆదివాసీ సంస్కృతి సంప్రదాయాలను భావి తరాలకు అందించే బాధ్యత ప్రభుత్వం తీసుకోవాలన్నారు. సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూనెం చిన్నవీరభద్రం, నాయకులు పులివీరయ్య శీలం కృష్ణ, తుమ్మల దురారెడ్డి, సోడె రాఘవరావు, కారం సంకురమ్మ, సోడె సత్యవతి, ఉద్యోగ పరిషత్ నాయకులు తిమ్మసాయి. సూర్యనారాయణ, మినప నాగేశ్వరరావు, మినప రామారావు పాల్గొన్నారు.

బిర్సా ముండాకు నివాళి



వై.రామవరం, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): పి.యర్రగొండ గురుకుల కళాశాలలో శుక్రవారం జాతీయ గౌరవ దివస్ బిర్సాముండా జయంతిని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ శ్రీపాదరామకృష్ణ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈసందర్భంగా వివిధ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

చట్టిలో శ్రమదానం



శ్రమదానంలో ఐటీడీఏ పీవో అపూర్వ భరత్

చింతూరు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతీ ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వ భరత్ అన్నారు. శుక్రవారం చట్టిలో శ్రమదానం నిర్వహించారు. శ్రమదానంలో పీవో పాల్గొన్నారు. ఈసందర్భంగా పీవో పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈవోపీఆర్డీ గుంపెనపల్లి మోహన్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ శ్యామ్, చింతూరు కార్యదర్శి ప్రసాద్, వైద్యశాఖ సిబ్బంది, అంగన్‌వాడీలు,పంచాయతీ సిబ్బంది శ్రమదానం చేశారు.

ఆకట్టుకున్న 'కత్తిపోటు'



ధర్మవరంలో కత్తిపోటు వేషం దృశ్యం

ప్రత్తిపాడు, నవంబరు15(ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరంలో గౌరీశంకర్ల ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక కళాకారులు ప్రదర్శించిన కత్తిపోటు వేషాలు ఆకట్టుకున్నాయి. ఏటా కార్తీక పౌర్ణమిరోజున గౌరీదేవి ఉత్సవాల్లోని పగటివేషాల ప్రదర్శనలో చివరిగా ఈ వేషాన్ని ప్రదర్శిస్తారు. ఇద్దరు బంది పోటులుగా ఒకరు మహారాజుగా నటించారు.

ధర్మవరంలో జ్వరాల తీవ్రత

ప్రత్తిపాడు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరంలో జ్వరాలు తీవ్రతతో పలువురు ఆసుపత్రుల్లో చేరారు. గ్రామంలో గత 10 రోజులుగా విష జ్వరాలు ప్రబలడంతో 20 మంది వరకు అస్వస్థతకు గురయ్యారు. ప్రత్తిపాడులోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. జ్వరాల బారిన పడి గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారని గ్రామంలో శానిటేషన్ ముమ్మరంగా నిర్వహించి వైద్యశిబిరం ఏర్పాటు చేయాలని బీజేపీ మండల ఉపాధ్యక్షుడు ఊటా వీరబాబు ఆధ్వర్యంలో పలువురు స్థానిక పంచాయతీ కార్యదర్శి కామరాజుకు వినతిపత్రం అందజేశారు.

సొసైటీ ఉద్యోగి అదృశ్యంపై కేసు

కోటనందూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): అప్పలరాజుపేట గ్రామానికి చెందిన కోటనందూరు సొసైటీ ఉద్యోగి బంగారు వీవవెంకట సత్యనారాయణ ఈనెల 12 నుంచి కన్పించడంలేదని అతడి భార్య శుక్రవారం కోటనందూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. సత్యనారాయణ ఈనెల 12న ఉదయం తన వాహనంపై సొసైటి కార్యాలయానికి వెళ్లి తిరిగిరాకపోవడంతో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

'గ్రామంలో బ్రిడ్జి వద్దు'

గండేపల్లి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలో రామేశ్వరంపేట సెంటర్‌లో ఫ్లైఓవర్ బ్రిడ్జి మంజూరైందని ఊరిమధ్యలో ఆ బ్రిడ్జి వద్దని గ్రామానికి చెందిన గింజాల దుర్గాప్రసాద్ యాదవ్, ఉబ్బిలి నారాయణరావు, సుబ్బారావు, దుంపాని స్వామి, రమణ తదితరులు శుక్రవారం ఆర్డీవో కార్యాలయంలో వినతి పత్రం అందించారు. బ్రిడ్జి నిర్మిస్తే చిరు వ్యాపారస్తులకు ఇబ్బంది కలుగుతుందని వెంటనే ఆలోచన విరమించుకోవాలని కోరారు.

నగర సంకీర్తన

గండేపల్లి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం సందర్భంగా మల్లేపల్లిలో అఖండ జ్యోతి వెలిగించి గ్రామం సుభిక్షంగా ఉండాలని భజన పాటలతో నగర సంకీర్తన చేపట్టారు. భారీసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



మల్లేపల్లిలో అఖండజ్యోతి ఊరేగిస్తున్న భక్తులు

Anand CINEMAS (4 SCREENS) Experience it in 4K Dolby Atmos
BHANUGUDI JUNCTION KAKINADA

DEVI CINEMAS (4 SCREENS) Experience it in 4K Dolby Atmos
CINEMA ROAD KAKINADA

BOOK ONLINE TICKETS Paytm

NOW SHOWING



GLADIATOR II - TEL
11-15AM, 2-15PM, 6-20PM, 9-20PM
MATKA (U/A) (TEL)
2-30PM, 10-00PM
AMARAN :
11-20AM, 2-40PM, 6-45PM, 9-40PM
KANGUVA (U/A) 3D (TEL)
11-30AM, 2-45PM, 6-30PM, 9-45PM

KANGUVA (U/A) (3D) (TEL)
11-15AM, 2-30PM, 6-30PM, 9-45PM
MATKA (TEL) (U/A)
11-30AM, 2-45PM, 6-20PM, 9-30PM
KA 2024 (TEL) : 11-40AM, 6-40PM
AMARAN (TEL)
11-20AM, 2-40PM, 6-45PM, 9-40PM

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

జిల్లాస్థాయి ఇసుక కమిటీ, కాకినాడ జిల్లా

తూర్పుగోదావరి జిల్లాలోని ఇసుక రీచ్‌ల నుండి ఇసుకను కాకినాడ జిల్లాలోని ఈ క్రింది నిల్వ కేంద్రముల వద్దకు రవాణా మరియు నిల్వచేసి, నిల్వ కేంద్రం నుండి వాహనాలలో లోడ్ చేయుట కొరకు లాటరి పద్ధతిన ఏజెన్సీని నియమించుటకు

ప్రకటన

నోటిఫికేషన్. సంఖ్య:1904/SAND/2024 తేది:15.11.2024

ఇందుమూలముగా ప్రకటించునది ఏమనగా, దిగువ షెడ్యూల్‌లో పేర్కొనబడిన ఇసుక రీచ్‌ల నుండి ఇసుకను కాకినాడ జిల్లాలోని ఈ క్రింది నిల్వ కేంద్రముల వద్దకు రవాణా మరియు నిల్వచేసి, నిల్వ కేంద్రం నుండి రవాణా వాహనాలలో లోడ్ చేయుట కొరకు లాటరి పద్ధతిన ఏజెన్సీని నియమించుటకు దరఖాస్తులు ఆహ్వానించబడుచున్నవి. దరఖాస్తులు జిల్లా గనులు మరియు భూగర్భశాఖ అధికారి వారి కార్యాలయం, కాకినాడలో ది.16.11.2024 నుండి 20.11.2024 తేదీన సాయంత్రం 05.00 PM వరకు స్వీకరించబడును.

క్రమ సంఖ్య	ఇసుకరీచ్ పేరు	పరిమాణం మెట్రిక్ టన్నుల్లో	ఇసుక నిల్వ కేంద్రము	నిల్వకేంద్రం వద్ద నిర్ధారించిన అమ్మకపు రేటు ఒక టన్నుకి (రూ.లలో)
1	వేమగిరి- కడియపులంక	68550	గొల్లప్రోలు	582/-
2	తీపర్రు-3	67950	పెద్దాపురం	600/-
			కాకినాడ	600/-

గమనిక: లాటరి నియమ నిబంధనలు, దరఖాస్తు నమూనాలు మొదలగు మరియు అనుబంధములను జిల్లా గనులు మరియు భూగర్భశాఖ అధికారి వారి కార్యాలయం, కాకినాడ నుంచి దరఖాస్తు, ఒక నిల్వ కేంద్రం కీ రూ.5000/- చొప్పున Collector and District Magistrate, kakinada and District Mines and Geology Officer, kakinada వారి పేరిట డిమాండ్ డ్రాఫ్ట్ చెల్లించి 20.11.2024 తేదీన మధ్యాహ్నం 1.00 గంటలోపు పొందవచ్చును.

జిల్లా కలెక్టర్ & ఛైర్మన్,
జిల్లా స్థాయి ఇసుక కమిటీ, కాకినాడ జిల్లా